

ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్లు అందుకుంటూ అవ్వాతాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. సీఎం చంద్రబాబు పెద్దకొడుకులా అండగా నిలుస్తూ ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేలు, ప్రత్యేక పరిస్థితుల్లో రూ.10-15 వేల వరకు అందిస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 02.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 133 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

## సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకు

## నదుల అనుసంధానంతో నీటి సమస్యకు పరిష్కారం

## గత పాలకులు బటన్ నొక్కారు.. రోడ్లకు గుంతలు పెట్టారు

## ఓటమి భయంతోనే గొడ్డలి పార్టీ ఏకగ్రీవాలు వద్దంటోంది

## నర్సాపురం పేదల సేవలో ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**నర్సాపురం(జర్నలిస్ట్ ఫైల్):** పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు సమ ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నర్సాపురం నియోజకవర్గం మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 31 ఏళ్ల క్రితం సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశానని చంద్రబాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పాటు ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తున్నామని సీఎం చెప్పారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు పెంచిన పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.73,507 కోట్లను పెన్షన్ల రూపంలో పేదలకు అందించామని చెప్పారు. రెండేళ్లలో సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట :** డ్వాక్రా సంఘాల ద్వారా పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టి మహిళా సాధికారతకు బాటలు వేశామని చంద్రబాబు అన్నారు. ఏ ఆడబిడ్డా వంట కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దీపం పథకాన్ని తీసుకొచ్చామని, ఇప్పుడు దీపం-2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉండాలనే ఉద్దేశంతో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈసారి లక్ష్యాన్ని మరింత పెంచామని తెలిపారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల్లో ఇంకా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఉందని సీఎం పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత మిగతా 2లో...

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

ఎడమ కాలువలో గోదావరి జలాల ప్రవాహం

**2.87** లక్షల ఎకరాలకు సాగునీరు

**5.23** లక్షల మందికి తాగునీరు

వచ్చే ఏడాది విశాఖకు.. ఆపై

సుజల స్రవంతికి

నేడు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

2లో

## ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందించడమే లక్ష్యం



- సేవలు సంక్లిష్టంగా ఉండకూడదు
- సరళతరం, సులభంగా సేలవలందించేలా చేయాలి
- మనమిత్ర ఇప్పటిక ప్రజాదరణ పొందింది
- ఇప్పుడు ఏపీ ఒన్ యాప్ కూడా తెస్తున్నాం
- దీన్ని కూడా ప్రజలకు చేరువ చేయాలి
- అధికారులకు ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ సూచన

3లో

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పౌరులకు ప్రభుత్వం అందించాల్సిన సేవలన్నీ కూడా ఎలాంటి అంతరాయం లేకుండా ఆన్‌లైన్ లోనే అందుబాటులో ఉండేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్యం దిశగా ప్రభుత్వ అధికారులు పనిచేయాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈఓ ప్రఖర్ జైన్ సూచించారు. ప్రభుత్వం కొత్తగా రూపొందిస్తున్న ఏపీఒన్ మొబైల్ అప్లికేషన్ యాప్ వినియోగంపై అధికారుల్లో అవగాహన కల్పించడం కోసం వివిధ శాఖల అధికారులతో ఆర్టీజీఎస్ రెండు రోజులు వర్క్‌షాపు (కార్యశాల) నిర్వహిస్తోంది.

## గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

- మరో రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- గ్రామీణ రహదారులు, తాగునీటి సదుపాయాల కల్పనకు నిధులు
- రూ.90 కోట్లతో 111 రహదారి పనులు.. రూ.10 కోట్లతో రక్షిత తాగునీటి ఏర్పాట్లు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** 'స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు' థీమ్‌తో గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గోదావరి పుష్కరాల సందర్భంగా మూడు జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల ద్వారా మరో రూ.100 కోట్ల నిధులను విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా కేటాయించిన రూ.100 కోట్లకు ఇవి అదనం.

కొత్తగా కేటాయించిన నిధుల్లో రూ.90 కోట్లతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పోలవరం ప్రాంతాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో 111 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. సుమారు 141 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రహదారులను నిర్మించనున్నారు. రాజోలు, పి.గన్నవరం, రామచంద్రపురం, రంపచోడవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు తదితర నియోజకవర్గాల్లో గ్రామాల నుంచి పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో గ్రామాల అంతర్గత రహదారులను కూడా మెరుగుపరచనున్నారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు సురక్షితమైన, రక్షిత తాగునీటిని అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మరో రూ.10 కోట్లను కేటాయించారు. ప్రతి పుష్కర ఘాట్‌లో తాగునీటి సదుపాయం కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గోదావరి పుష్కరాలను రాజమహేంద్రవరం వంటి ప్రధాన కేంద్రాలకే పరిమితం చేయకుండా పవిత్ర గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రతి గ్రామంలో భక్తులు పుష్కర స్నానాలు, పూజలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనులు చేపడుతోంది. మిగతా 2లో...



# అక్షరాంధ్రతో.. అక్షర విజయం!

- 72.6% నుంచి 82.1%కు అక్షరాస్యత
- ఒక్క ఏడాదిలో 25 లక్షల మందికి అక్షర జ్ఞానం
- 2027 సెప్టెంబరుకు సంపూర్ణ అక్షరాస్యత దిశగా అడుగులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో గత ఏడాది చేపడుతున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ఉద్యమంలా పనిచేసి వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అధికారులంతా కలసికట్టుగా కృషిచేయాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 2024నాటికి రాష్ట్రంలో అక్షరాస్యత శాతం దేశంలోనే అట్టడుగున కేవలం 72.6శాతం ఉండగా, గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా 25లక్షలమంది అక్షరాస్యులుగా మారారు, ఒక్క ఏడాదిలో ఇంత భారీగా అక్షరాస్యత సాధించడంపై ఎపి కృషిని కేంద్రప్రభుత్వం అభినందించినట్లు అధికారులు తెలుపగా, మిగతా 2లో...

## మంగళగిరి.. నెం.1 లక్ష్యం!

పేదల ఇంటి పట్టాల పంపిణీలో చరిత్ర సృష్టించాం

కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమే

అధికారుల కృషికి మంత్రి నారా లోకేష్ అభినందన

2లో

# 2.82 కోట్ల మందికి ఎన్ సీడీ పరీక్షలు పూర్తి

రాష్ట్రంలో **59.29** లక్షల బీపీ, **48.15** లక్షల మధుమేహం కేసుల గుర్తింపు

తాజా సర్వేలో **11.79** లక్షల కొత్త బీపీ, **10.72** లక్షల కొత్త మధుమేహం కేసులు

మిగిలిన వారు కూడా పరీక్షలు చేయించుకోవాలి : మంత్రి సత్యకుమార్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో అసాంక్రమిక వ్యాధులను ముందుగానే గుర్తించి, సకాలంలో చికిత్స అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌సీడీ-4.0 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 2,82,38,795 మందికి పరీక్షలు పూర్తయ్యాయి. 18 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న జనాభాను లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో ఇప్పట వరకు 66.05 శాతం పరీక్షలు పూర్తయ్యాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మిగతా 2లో...

## ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు!



- ఎల్ఎంసీ ఫస్ట్ ఫేజ్ సిద్ధం.. నేడు జలహారతి
- రెండేళ్లలోనే పనులు పూర్తి చేశాం: మంత్రి నిమ్మల
- విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు భరోసా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఉత్తరాంధ్ర ప్రజలు రెండు, మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఫస్ట్ ఫేజ్ పనులు పూర్తికావడంతో నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జలహారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించే మహత్తర కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు. మిగతా 3లో...

## ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యం

- స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం
- ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం
- ఎస్ఐసిసిఐ 116వ వార్షిక సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ భారత చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మిగతా 2లో...

# 2.82 కోట్ల మందికి ఎన్‌సీడీ పరీక్షలు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌సీడీ-4.0 తాజా పురోగతి నివేదికను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు మంత్రికి నివేదించారు.

2025 సెప్టెంబర్ 17న ప్రారంభమైన ఎన్‌సీడీ-4.0లో భాగంగా 2026 ఆగస్టు 31 నాటికి 3,71,86,846 మందికి సర్వే పూర్తయిందని మంత్రి తెలిపారు. ఇది లక్ష్య జనాభాలో 86.97 శాతానికి సమానమన్నారు. సర్వే సమయంలో ఇళ్ల వద్ద అందుబాటులో లేకపోవడం, వలస వెళ్లడం, మరణాలు తదితర కారణాలతో కొంతమంది పరీక్షలకు అందుబాటులోకి రాలేదని వివరించారు. రాష్ట్ర జనాభా 4,27,56,478 మందిలో ఇప్పటివరకు 2,82,38,795 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

**59.29 లక్షల బీపీ, 48.15 లక్షల మధుమేహం కేసులు** : ఎన్‌సీడీ-4.0 కింద ఆగస్టు 2026 వరకు రాష్ట్రంలో మొత్తం 59.29 లక్షల అధిక రక్తపోటు కేసులు గుర్తించినట్లు మంత్రి తెలిపారు. వీటిలో తాజా సర్వే ద్వారా 11.79 లక్షల కొత్త బీపీ కేసులను గుర్తించగా, మిగిలిన కేసులు గతంలో నిర్వహించిన సర్వేల ద్వారా గుర్తించినవని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 48.15 లక్షల మధుమేహం కేసులు గుర్తించగా, తాజా సర్వేలో 10.72 లక్షల కొత్త మధుమేహం కేసులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో అనుమానితులుగా గుర్తించిన 22,110 నోటి క్యాన్సర్, 14,822 రొమ్ము క్యాన్సర్, 18,837 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులను తదుపరి పరీక్షల కోసం క్యాన్సర్ వైద్య విభాగాలకు పంపినట్లు మంత్రి తెలిపారు. తదుపరి పరీక్షల్లో 2,026 నోటి క్యాన్సర్, 3,571 రొమ్ము క్యాన్సర్, 2,076 గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు నిర్ధారణ అయ్యాయని, ఆయా రోగులకు సకాలంలో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు.

**బాపట్లలో అత్యధిక బీపీ, మధుమేహం కేసులు** : జిల్లాల వారీగా అధిక రక్తపోటు కేసుల శాతాన్ని పరిశీలిస్తే బాపట్ల 19.65 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ 19.45, పశ్చిమ గోదావరి 19.05, కృష్ణా 17.97, తూర్పు గోదావరి 17.77 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 5.63 శాతం, శ్రీ సత్యసాయి 8.47, అన్నమయ్య 9.93, చిత్తూరు 10.10, కర్నూలు 10.28 శాతం నమోదయ్యాయి.

మధుమేహం కేసుల శాతంలో బాపట్ల 16.89 శాతంతో మొదటి స్థానంలో ఉంది. పశ్చిమ గోదావరి 15.89, తూర్పు గోదావరి 15.23, ప్రకాశం 15.19, కృష్ణా 15.01 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1.51 శాతం, పోలవరం 5.88, శ్రీ సత్యసాయి 6.56, కర్నూలు 6.86, పార్వతీపురం మన్యం 7.14 శాతం నమోదయ్యాయి.

**అల్లూరిలో అత్యల్ప కేసులు** : గిరిజన జనాభా అధికంగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో అధిక రక్తపోటు, మధుమేహం కేసుల శాతం రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పోలిస్తే అత్యల్పంగా నమోదైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సహజ ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వడం, నిత్య జీవితంలో శారీరక శ్రమతో కూడిన సంప్రదాయ జీవన విధానం ఇందుకు కారణమై ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ అంశాల ప్రభావాన్ని శాస్త్రీయంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆరోగ్యకరమైన సంప్రదాయ జీవన విధానంలోని మంచి అంశాలను ప్రోత్సహించడంతో పాటు గిరిజన ప్రాంతాల్లోనూ అసాంక్రమిక వ్యాధులపై నిరంతర పరీక్షలు, అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి తెలిపారు. ఎన్‌సీడీ--4.0 సర్వే తుది దశకు చేరుకుందని, సర్వే కోసం ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# ఎంఎస్‌ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

116వ వార్షిక సర్వసభ్య సమావేశం చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో ఘనంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో చర్చలు జరిపారు.

సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపుఇచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థికసాయంతో ఏపీలో ఎంఎస్‌ఎంఈలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్, ఎన్ఆర్ఐ వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఐసిసిఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ మాట్లాడుతూ 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని.. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర ఏ2047' లక్ష్యాల సాధనలో చిన్న పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్ యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ, లయోలా ఇన్‌స్టిట్యూట్, త్యాగరాజ కాలేజ్, భారతిదాసన్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎన్. శివ శంకర్ ధన్యవాద సమర్పణతో

# గోదావరి తీరానికి అభివృద్ధి హారతి

(మొదటి పేజీ తరువాయి)

**మునికూడలిని మోడల్ పుష్కర పంచాయతీగా అభివృద్ధి:** ఇప్పటికే రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మునికూడలిని రూ.7 కోట్ల వ్యయంతో 'మోడల్ పుష్కర పంచాయతీ'గా అభివృద్ధి చేసే పనులను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. సప్తఋషి ఘాట్‌కు సకల హంగులు కల్పించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సీసీ రహదారుల నిర్మాణం, టవర్ లైట్ల ఏర్పాటు, మునికూడలిలో మ్యాజిక్ డ్రెయిన్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, పుష్కర ఘాట్ల వద్ద మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కర ఘాట్లను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఏపీపీసీబీ నిధులతో సమగ్ర అభివృద్ధి** : ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ద్వారా కేటాయించిన రూ.100 కోట్లను ఆయా జిల్లాల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో వినియోగించనున్నారు. పోలవరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రతిపాదిత అభివృద్ధి పనులకు ఈ నిధులను ఉపయోగించనున్నారు.

గోదావరి పుష్కరాలను పరిశుభ్రంగా, భక్తులకు సౌకర్యవంతంగా నిర్వహించడంతో పాటు గోదావరి తీర గ్రామాల్లో శాశ్వత మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

# పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి న్యాయం చేశామని చెప్పారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీ పరీక్షలు, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యా అవకాశాలకు పంపిస్తున్నామని తెలిపారు.

**బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్** : బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వచ్చి పెన్షన్ ఇస్తున్నాం అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి ఆర్థికంగా వెసులుబాటు కలిగించామని చెప్పారు. గ్రామంలో ఇంకా పేదలు ఉన్నారంటే ఆ గ్రామానికే అవమానమని వ్యాఖ్యానించారు. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీ4 ద్వారా జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవస్వామి పాదాల వరకు



నీరు పారించామని చెప్పారు. నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి నీటిని తరలించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి నీటిని ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలు తొలుత అనకాపల్లికి, వచ్చే ఏడాది విశాఖకు, ఆ తర్వాత వంశధార ప్రాంతానికి చేరేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నదుల అనుసంధానంతో దేశంలోని నీటి సమస్యలను పరిష్కరించాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు.

**పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్య స్థానంగా మారుస్తాం:** గత పాలకులు పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేశారని సీఎం విమర్శించారు. దీనివల్ల యువత భవిష్యత్తు దెబ్బతిందన్నారు. ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని తెలిపారు. విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ట్రూ డౌన్ ద్వారా విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతుకు అండగా నిలిచేందుకు విద్యుత్ యూనిట్‌ను రూ.1.5 కే అందిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో ఇతర దేశాలతో పోటీ పడేలా ఆంధ్రప్రదేశ్ ఆక్వా ఉత్పత్తులను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుపైనా దృష్టి పెట్టామని తెలిపారు. నర్సాపురం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు , డెల్టా మోడర్నైజేషన్ వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

**ఎన్డీఏ కూటమికి తిరుగులేదు** : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు వార్డు సభ్యులు, సర్పంచులు కూడా పాలనలో భాగం కావాలన్నారు. అప్పుడే కేంద్రం నుంచి గ్రామీణాభివృద్ధికి నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఓటమి భయంతోనే ఏకగ్రీవాలను వద్దని గొడ్డలి పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఏకగ్రీవాలను ప్రభుత్వాలే ప్రోత్సహించాయని. మున్సిపాలిటీలు, ఆయారాం- గయారాం అనే పరిస్థితి లేకుండా కార్పోరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్షం చేశామని అన్నారు. గొడ్డలి పార్టీ నేతలు బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించేశారని సీఎం ఆక్షేపించారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరక్కుండా అడ్డుకోవటమే గొడ్డలి పార్టీ ఆలోచన అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అక్షరాంధ్రతో.. అక్షర విజయం!



(మొదటి పేజీ తరువాయి)

మంత్రి లోకేష హర్షం వ్యక్తంచేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో 10శాతం పెరిగి 82.1శాతానికి చేరుకుంది, 2027 సెప్టెంబర్ నాటికి నూరుశాతం అక్షరాస్యత సాధన దిశగా పనిచేయాలని మంత్రి కోరారు. 2027 మార్చినాటికి మరో 25లక్షలమందిని, సెప్టెంబర్ నాటికి మిగిలిన 27లక్షలమంది అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు చెప్పారు. ఇందుకోసం 11 ప్రభుత్వశాఖల సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, పెద్దఎత్తున ప్రజలను చైతన్యవంతం చేయాలని మంత్రి సూచించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఇంటర్మడియట్ లో సుమారు 10వేల అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్ కింద వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహించేలా రూట్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ ఏడాది తల్లికి వందనం పథకం ద్వారా ఇప్పటికే రూ.1051 కోట్ల మేర ఆర్థిక సాయం అందించగా, మొదటి సంవత్సరం విద్యార్థులకు త్వరలో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడి ఇంటిగ్రేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

**బడిబయట చిన్నారులను పాఠశాలల్లో చేర్చేలా చర్యలు** : పాఠశాల విద్యపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ... బడిఈడు పిల్లలందరినీ ట్రాక్ చేసి పాఠశాలల్లో చేర్పించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికీ బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేర్పించేలా అధికారులు చొరవచూపాలని స్పష్టంచేశారు. పాఠశాల విద్య డైరక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ... ఈ ఏడాది 33వేలమంది బడిబయట ఉన్న చిన్నారులను స్కూళ్లలో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను కూడా లీప్ యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపించామని చెప్పారు. బడి ఈడు పిల్లలు ప్రతిఒక్కరినీ స్కూళ్లలో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేసేలా చర్యలు తీసుంటున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీచర్ అటెండెన్స్ గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం ఉపాధ్యాయుల హాజరుశాతం 98.97శాతంగా ఉన్నట్లు చెప్పారు. విద్యార్థుల హాజరు శాతాన్ని 85.41శాతంగా ఉందని, దీనిని కూడా పెంచేందుకు కృషిచేయాలని మంత్రి కోరారు. ఏదేని విద్యార్థి వరుసగా 3రోజులపాటు వరసగా పాఠశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులను స్కూళ్లకు పిలిపించి ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. ఈ విషయంలో స్కూలు మేనేజ్ మెంట్ కమిటీలకు కూడా బాధ్యతలు అప్పగించాలన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను విజయవంతంగా నిర్వహించడంపై మంత్రి లోకేష్ ఉపాధ్యాయులు, అధికారులను అభినందించారు. ఎఐ సమర్థ్ ఇనిషియేటివ్ ద్వారా ఉపాధ్యాయులకు ఎఐ టూల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలో పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే మిషన్ మార్చి -2026పై సమీక్షించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు తప్పనిసరిగా నిర్వహించాల్సిన స్పెషల్ టెట్ నిర్వహణపై చర్చించారు.

ఈనెల 5వతేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో 192మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల విద్య డైరక్టర్ చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత విషయంలో రాజీ పడబోమని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లీప్ యాప్ ద్వారా ఫీడ్ బ్యాక్ అందజేయాలని మంత్రి కోరారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి.. నెం.1 లక్ష్యం!

**ఉండవల్లి (జర్నలిస్ట్‌ఫైల్)** : అన్ని రంగాల్లో మంగళగిరి నెం.1గా ఉండాలనేది లక్ష్యమని, ఇందుకు అధికారుల సహకారం కావాలని నియోజకవర్గ ఎమ్మెల్యే, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన అధికారులు, ఎంటీఎంసీ, రెవెన్యూ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసం వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికలో ఆత్మీయ విందు సమావేశం నిర్వహించారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన అధికారులకు మంగళగిరి ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేను మంగళగిరిలో పుట్టలేదు, మంగళగిరిలో పెరగలేదు. 2019లో మంగళగిరిని నా సొంతం చేసుకున్నా. ఎన్నికలకు 21 రోజుల ముందు వచ్చాను. నేనేంటో ప్రజలకు అర్థం కాలేదు. ప్రజల సమస్యలు నేను తెలుసుకోలేకపోయాను. ఇంటి పట్టా హామీ ఇస్తే గెలుస్తానని చాలా మంది నాయకులు చెప్పారు. సమస్యను అర్థం చేసుకోకుండా హామీ ఇవ్వలేనని చెప్పా. హామీ ఇస్తే నిలబెట్టుకోవడం నాకున్న అలవాటు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లు ప్రజలతో కలిసి ప్రయాణించా. వారి సమస్యలు నేరుగా అర్థం చేసుకున్నా. అందులో ప్రధాన సమస్య శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత భూహక్కు కల్పించాలని ఇక్కడి ప్రజలు కోరారు. శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తామని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చా. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. 91వేల మెజార్టీతో మంగళగిరి ప్రజలు నన్ను గెలిపించారు. ఆ రోజు నుంచి నేను మిమ్మల్ని పరిగెత్తించాను.

**కలిసికట్టుగా పనిచేస్తే చేస్తే ఏదైనా సాధించగలుగుతాం** : నీతి, నిజాతీయలతో మీరు ప్రజల వద్దకు వెళ్లి ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ డేటాతో రెండు విడతల్లో మంగళగిరి ప్రజలకు శాశ్వత ఇంటి పట్టాలు అందించాం. సుమారు 6వేల కుటుంబాలకు అందరం కలిసికట్టుగా న్యాయం చేశాం. ఇదొక చరిత్ర. పట్టాల పంపిణీని ఏవిధంగా చేశారని అనేక మంది ప్రజాప్రతినిధులు నన్ను అడిగారు. మంగళగిరికి వచ్చి చూడాలని చెప్పాను. నేను బలంగా నమ్మేది టీమ్ వర్క్ ని. కలిసికట్టుగా పనిచేస్తే చేస్తే ఏదైనా సాధించగలుగుతాం.

**మంగళగిరి ప్రజల తరపున అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా** : దేశం మొత్తం



మంగళగిరి వైపు చూసే విధంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చా. ప్రభుత్వం నుంచి పైసా తీసుకోకుండా నిడమర్రు పాఠశాలను అభివృద్ధి చేశాం. పార్క్ లు, కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ సెంటర్లు అభివృద్ధి చేస్తున్నాం. అంగన్వాడీ సెంటర్ల ఆధునీకరణ, పీఎం సూర్యఘర్ కింద కార్యక్రమాలు చేస్తున్నాం. సమిష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో ఇదో ఉదాహరణ. భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించాం. తాగునీటి పైప్ లైన్ కార్యక్రమం చేపడుతున్నాం. ఏ పని చేసినా పట్టుదల, అంకితభావంతో చేస్తున్నాం. అందరూ సహకరిస్తున్నారు కనుకనే మనం చరిత్ర సృష్టించగలుగుతున్నాం. ఇది ఒక వ్యక్తి వల్ల సాధ్యం కాదు. టీమ్ తో సాధ్యం. అందుకే మిమ్మల్నందరినీ కలిసి గౌరవించాలని భావించా. మీరు చేసిన మంచి పనికి మిమ్మల్ని కలిసి గౌరవించడం జరుగుతోంది. మనందరం కలిసి మరో వందడుగులు ముందుకు వేయాలి. మంగళగిరి ప్రజల తరపున ఇక్కడున్న అధికారులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. మీ కృషి వల్ల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం అయింది. అన్ని రంగాల్లో మంగళగిరి నెం.1గా ఉండాలనేది లక్ష్యం. ఇటీవల మోడల్ రైతు బజార్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశాం. భవిష్యత్ లోనూ మీ సహకారం ఉంటుందని ఆశిస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. అనంతరం అధికారులు, ఎంటీఎంసీ, రెవెన్యూ సిబ్బందికి నూతన వస్త్రాలు బహూకరించి మంత్రి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీం బాషా, అడిషనల్ కమిషనర్ కే.వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ రవి కుమార్, మంగళగిరి తహశీల్దార్ కే.దినేష్ రాఘవేంద్ర, తాడేపల్లి తహశీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ కే.అశోక్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జీ.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో గోదారమ్మ పరవళ్లు

**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్):** పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా గోదారమ్మ ఉత్తరాంధ్రవైపు పరుగులు పెట్టనుంది. నాలుగు నదుల్ని దాటుకుంటూ ... తూర్పు కనుమల్లో దారి చేసుకుంటూ గోదారి ఉత్తరాంధ్ర ప్రాంతానికి కదలి రానుంది. రేపు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చిన గోదావరి జలాలకు హారతి ఇచ్చి స్వాగతం పలకనున్నారు. కాలువపై నిర్మించిన రెగ్యులేటర్ ను ఆన్ చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు విడిచి పెట్టనున్నారు. రేపు మధ్యాహ్నం 2.20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి.. పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే జలాలకు జల హారతి ఇచ్చి నీటిని విడుదల చేయనున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ ఏడాదిలోనే అనకాపల్లికి గోదావరి నీళ్లు తీసుకెళ్తామని సంకల్పం చేసిన సీఎం ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నీటిని విడుదల చేయనున్నారు.

**నదులు.. కొండలు దాటుకుని గోదావరి పరుగులు** : ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడిచి పెడుతున్న నీటి ద్వారా మొత్తం నాలుగు జిల్లాల పరిధిలోని 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. 5.23 లక్షల మంది దాహార్తి తీరనుంది. ఎడమ కాలువ నిర్మాణం కోసం ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్ల ఖర్చు చేసింది. పోలవరం ఎడమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలు ఈ జిల్లాల్లో ఉన్న పంపా, తాండవ, వరాహ, శారద నదుల్ని దాటుకుని, ఏలేరు కాలువ, తూర్పు కనుమలపై సంక్లిష్టమైన నిర్మాణాల మీదుగా ఉత్తరాంధ్రకు చేరుకోనున్నాయి. పోలవరం ఎడమ కాల్వ నిర్మాణంలో భాగంగా వివిధ నదీ ప్రవాహాల వద్ద సైఫన్లు.. అక్విడెక్టులను జలవనరుల శాఖ నిర్మించింది. ఈ నదుల ప్రవాహానికి కొన్ని చోట్ల ఎగువన..ఇంకొన్ని చోట్ల ప్రవాహానికి దిగువ నుంచి పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ నిర్మాణం జరిగింది. ఏలేరు నది బెడ్ లెవల్ కు దిగువన గోదావరి జలాలను తరలించేందుకు సైఫన్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. పంపా నది ఎగువ నుంచి అక్విడక్ట్ నిర్మించి పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలకు ఇంజనీర్లు మార్గం సుగమం చేశారు. పంపా నదిపై అక్విడెక్ట్ నిర్మాణానికి 30 మీటర్ల లోతు వరకు 312 పైల్స్‌తో పునాదుల వేసి అక్విడెక్ట్ ను నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 6 వెంట్లతో 447 మీటర్ల పొడవున అక్విడక్టు నిర్మాణం జరిగింది.

**భవిష్యత్తులో 8 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ** : ప్రస్తుతం ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న గోదావరి జలాలతో అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. పాయకరావుపేట అక్విడెక్టు నుంచి సీఎం విడుదల చేయనున్న జలాలు అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేలా జలవనరుల శాఖ ప్రణాళిక చేసింది. గోదావరి జలాలతో పుష్కర ఆయకట్టు పరిధిలో 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా కింద 12 వేల ఎకరాలు, తాండవ, వరహా, మామిడి గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న 46,620 ఎకరాల స్థిరీకరణ జరగనుంది. మొత్తంగా 23.44 టీఎంసీల గోదావరి జలాలు సాగు, తాగు నీటితో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో



అనుసంధానించేలా 213 కిలోమీటర్ల పొడవున పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతితో అనుసంధానం ద్వారా అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతిపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎగువ ప్రాంతాలకు గోదావరి నీరు తరలించేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. తద్వారా ఎడమ ప్రధాన కాలువ సహా ఉత్తరాంధ్రలో జిల్లాల్లో మొత్తం 8 లక్ష ఎకరాలకు సాగునీరు, ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

# వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





- పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసి యువతను దేశ భవిష్యత్తుతో అనుసంధానించాలి
- నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప ఉత్సవాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ , మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ (జర్నలిస్ట్ఫైల్) :** వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో కొనసాగుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవాలు' నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని రామారావు కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర కార్యశాలను ఆయన ప్రారంభించారు.

ప్రధాని నరేంద్ర మోదీ దేశం కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. సమస్యలు, సవాళ్లను ముందుగానే గుర్తించి వాటికి పరిష్కారాలు చూపుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మోదీకి విశేష గుర్తింపు లభించిందని తెలిపారు. త్రివర్ణ పతాకానికి అంతర్జాతీయంగా గౌరవం పెరగడం ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచ దేశాలు భారత్ తీవ్రంగా దెబ్బతింటుందని భావించినప్పటికీ, దేశీయంగా వ్యాక్సిన్లను అభివృద్ధి చేసి ప్రజలకు అందించడంతో పాటు ఇతర దేశాలకు కూడా సరఫరా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఇబ్బందులు తలెత్తకుండా ముందుచూపుతో క్రూడ్ ఆయిల్ నిల్వలను ఆరు నెలలకు సరిపడా సిద్ధం చేసినట్లు తెలిపారు.

గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ సాధించిన అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న ప్రజల ఆకాంక్షతోనే ఆయన ప్రధానిగా ఎదిగారని పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం చేరాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య కూడా భారత్ అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచడం, ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రాధాన్యం ఇవ్వడం, ప్రపంచ సంక్షోభాల్లో భారతీయుల భద్రతకు చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**పిల్లల సృజనాత్మకతను వెలికితీయాలి :** సేవా సంకల్ప ఉత్సవాల దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసి దేశ నిర్మాణంతో అనుసంధానం చేయాలని సూచించారు. 15 ఏళ్ల వయస్సు నుంచే పిల్లల్లో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లినప్పుడు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని అత్యంత వినయంగా విద్యార్థులతో మమేకం కావాలని సూచించారు.

గతంలో దేశం ఎలా ఉండేది, ప్రస్తుతం ఎలాంటి మార్పులు వచ్చాయి, ఆ మార్పులకు కారణాలేమిటి, భవిష్యత్‌లో భారత్ ఎలా ఉండాలి అనే అంశాలపై విద్యార్థులతో చర్చలు నిర్వహించాలని సత్యకుమార్ సూచించారు. డ్రాయింగ్, వ్యాసరచన, ప్రసంగం, నాయకత్వ నైపుణ్యాలు వంటి పోటీలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో దేశభక్తి, సృజనాత్మకతను పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు భవిష్యత్ భారతదేశాన్ని ఎలా చూడాలనుకుంటున్నారో వారి అభిప్రాయాలను సేకరించి వీడియోల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

**వికసిత్ భారత్ అందరి సమిష్టి బాధ్యత:** వికసిత్ భారత్ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కరి కల, బాధ్యత కాదని, దేశంలోని ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక తదితర అన్ని రంగాల్లో భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచి విశ్వగురువుగా ఎదగాలన్న లక్ష్యాన్ని యువతకు వివరించాలని సూచించారు. వేదికపై ఉన్న నాయకుల నుంచి ప్రతి కార్యకర్త వరకు సమాజంలోని ప్రతి ఒక్కరినీ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.

సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని, పార్టీ గుర్తింపుకు మించి సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా కార్యకర్తలు ప్రజల విశ్వాసాన్ని పొందాలని సత్యకుమార్ అన్నారు. ముందుగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను వాటిలో భాగస్వాములను చేయడం ద్వారా బీజేపీ ప్రజల కోసం పనిచేస్తోందనే విశ్వాసాన్ని కల్పించాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో దేశభక్తి, దేశం పట్ల బాధ్యత, సమాజ సేవ వంటి భావాలను పెంపొందిస్తే వారు భవిష్యత్తులో దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.

**పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం :** రాష్ట్ర కార్యశాలను రాష్ట్ర ఇన్‌ఛార్జి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. అతిథులను పార్టీ ఉపాధ్యక్షురాలు నిర్మలా కిషోర్ వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ సమారోప్ నిర్వహించారు. కార్యశాలకు ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్నలతో పీవీఎన్ మాధవ్ సమావేశమై పార్టీ కార్యక్రమాల రూపకల్పన, సేవా సంకల్ప ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పలు సూచనలు చేశారు.

## ప్రభుత్వ సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సేవల కోసం ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగకుండా అన్ని సేవలను ప్రజలు తాము ఉన్నచోటు నుంచే పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ గారి మార్గదర్శనంలో ఆర్టీజీఎస్ తీసుకొచ్చిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రజాదరణ పొందిందన్నారు. ఇందులో ఇప్పటికే వెయ్యికిపైగా సేవలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దీంతో పాటు ఇప్పుడు ప్రజలకు ఒక మొబైల్ అప్లికేషన్ యాప్ కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా ఆర్టీజీఎస్ ఏపీఒన్ అనే మొబైల్ అప్లికేషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని చెప్పారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తమకు కావాల్సిన అన్ని సేవలను ఎలాంటి అంతరాయం లేకుండా, అడ్డంకులు లేకుండా సులభంగా పొందేలా దీన్ని తీసుకొచ్చామన్నారు. గతంలో ఒక సర్టిఫికెట్ పొందాలన్నా, ఒక కరెంటు కనెక్షన్ పొందాలన్నా మంజూరు చేసే పద్ధతులు ఎంతో సంక్లిష్టంగా ఉండేవని, ఇప్పుడు ఆ పాత పద్ధతులకు స్వస్తి పలికి టెక్నాలజీ వినియోగంతో ప్రజలకు సేవలను సరళతరం, సులభతరం చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే పలు సేవలను ఎంతో సులభతరం, సరళతరం చేశామన్నారు. ఏపీఒన్ యాప్ ద్వారా ప్రజలు ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా చేయాలని, ఈ యాప్ ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు సైతం ఈ యాప్‌పై అవగాహన పెంచుకుని ప్రజలకు ఈ యాప్ వినియోగం ద్వారా ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు.

## పెమ్మసాని ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్ష



**కొలనుకొండ (జర్నలిస్ట్ఫైల్) :** గుంటూరు-విజయవాడ ప్రాంతంలో జాతీయ రహదారులకు సంబంధించిన కీలక సమస్యలు, పెండింగ్ పనుల పురోగతిపై గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొలనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వివిధ రహదారి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్ అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండు వారాల్లో సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.

సమావేశంలో వెస్ట్ బైపాస్‌పై చిన్నకాకాని ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ తయారీ, తదుపరి కార్యాచరణ, కాలపట్టికపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్ ప్రతిపాదనలు, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపిన నివేదికలు, వాటి పురోగతిపై అధికారులతో చర్చించారు. సుద్దపల్లి డొంక వద్ద ఆర్‌యూబీ, డ్రెయిన్ అవుట్‌లెట్, వెంకటపాలెం టోల్ ప్లాజా సమస్యలు, పెదకాకాని వై జంక్షన్‌ను ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు.

## ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు!

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఎలఎంసీ పనుల్లో అనేక క్లిష్టమైన సమస్యలను అధిగమించి ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేసిందన్నారు.

**ఐదు ప్రధాన నదులను దాటుతూ.. :** పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఏలేరు, పంపా, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను దాటుకుంటూ కాలువను నిర్మించినట్లు మంత్రి తెలిపారు. 11 ప్రాంతాల్లో జాతీయ రహదారులను క్రాస్ చేస్తూ పనులు పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవ వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న భూసేకరణ సమస్యను పరిష్కరించి, అత్యంత క్లిష్టమైన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల లోతు వరకు కొండను కట్ చేసి కాలువ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. వేలాది నిర్మాణాలు, భూసేకరణ సమస్యలు, ఇతర సాంకేతిక అవాంతరాలను అధిగమించి రెండేళ్లలోనే ఎలఎంసీ ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

**ఐదేళ్లలో ఒక్క తట్ట మట్టి పని లేదు! :** 2019-2024 మధ్య ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఒక్క తట్ట మట్టి పని కూడా జరగలేదని మంత్రి విమర్శించారు. ఒక్క రూపాయి పని కూడా చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే క్లిష్టమైన పనులను పూర్తి చేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడం ప్రారంభించిందన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి జీవనాడి :** పోలవరం ఎలఎంసీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి జీవనాడిగా మారనుందని మంత్రి అన్నారు. ఎలఎంసీ ద్వారా విశాఖపట్నం నగరానికి తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు, భవిష్యత్‌లో రానున్న పరిశ్రమలకు అవసరమైన నీటి భద్రత కల్పించవచ్చన్నారు. నీరు, పరిశ్రమలు, పెట్టుబడులతో ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి శకం ప్రారంభం కానుందని తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, ఇప్పుడు ఉత్తరాంధ్రకే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వచ్చే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

**పోలవరం పూర్తయ్యే వరకు ఆగాల్సిన పనిలేదు :** 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. అయితే పోలవరం పూర్తయ్యే వరకు ఉత్తరాంధ్ర ప్రజలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా ఎలఎంసీకి నీటిని అందిస్తున్నామని చెప్పారు. నాడు పురుషోత్తపట్నం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారు.. అధికారంలోకి వస్తే పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి విమర్శించారు. అయితే నేడు అదే పురుషోత్తపట్నం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందుతున్నాయని తెలిపారు.

**పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణానికి రూ.29 కోట్లు :** పోలవరం ఎలఎంసీ పనుల్లో భాగంగా పుష్కర లిఫ్ట్‌కు సంబంధించిన పంపులను తొలగించాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రూ.29 కోట్లతో పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణ పనులు చేపట్టామని చెప్పారు. పనులు పూర్తయితే అదనంగా 700 నుంచి 1,500 క్యూసెక్కుల వరకు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రాంతంలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. రాబోయే రెండేళ్లలో ఆయా ప్రాజెక్టులపై రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీకి అవసరమైన అనుమతులను కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. రాబోయే 3-4 నెలల్లో నేరడి బ్యారేజీ పనులను పట్టాలెక్కించి ఉత్తరాంధ్ర చిరకాల కలను సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**కృష్ణా జలాలు ప్రకాశానికి.. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు :** వెనుకబడిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలను తరలించామని, ఇప్పుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తున్నామని మంత్రి తెలిపారు.

## డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల ఉక్కుపాదం

- అమరావతి రాజధాని, తాడేపల్లి ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ
- పేకాట, కోళ్ల పందేలు, గంజాయి, బహిరంగ మద్యం సేవనంపై నిఘా



**గుంటూరు (జర్నలిస్ట్ఫైల్):** అమరావతి రాజధాని, తాడేపల్లి ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు గుంటూరు జిల్లా పోలీసులు డ్రోన్ నిఘాను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు తుళ్లూరు డీఎస్పీ, నార్త్ డీఎస్పీ పర్యవేక్షణలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టారు. పేకాట స్థావరాలు, కోళ్ల పందేలు, గంజాయి వినియోగం, విక్రయానికి సంబంధించిన అనుమానాస్పద ప్రాంతాలు, బహిరంగంగా మద్యం సేవించే ప్రదేశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అమరావతి రాజధాని పరిధిలోని తుళ్లూరు, మందడం, వెంకటపాలెం, వెలగపూడి ప్రాంతాలతో పాటు తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగరం, కృష్ణానది కరకట్ట, సీతానగరం ఘాట్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ కొనసాగుతోంది. ముఖ్యమైన ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లోనూ నిఘా కొనసాగించేందుకు నైట్ విజన్ డ్రోన్లను వినియోగిస్తున్నారు. డ్రోన్ నిఘా ద్వారా అనుమానాస్పద కదలికలు, వ్యక్తులు, ప్రదేశాలను గుర్తించి సంబంధిత పోలీసు సిబ్బందికి సమాచారం చేరవేస్తున్నారు. దీంతో పోలీసులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

చట్టవిరుద్ధ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని గుంటూరు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరాన్ని బట్టి గుంటూరు జిల్లా పరిధిలోని ఇతర గ్రామాలు, శివారు ప్రాంతాలకు కూడా డ్రోన్ నిఘాను విస్తరించనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ప్రజలు తమ ప్రాంతాల్లో పేకాట, కోళ్ల పందేలు, గంజాయి వినియోగం లేదా విక్రయం, బహిరంగ మద్యం సేవనం వంటి అసాంఘిక కార్యకలాపాలను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని సూచించారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం కోసం పోలీసుల నిఘా, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## వైద్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని వినతి



**అమరావతి(జర్నలిస్ట్ఫైల్):** ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు నూతన సీఈఓ పద్మావతిని మంగళవారం కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన అనంతరం వైద్య మిత్రల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 19 ఏళ్లుగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న తమకు నెలకు రూ.15 వేల వేతనం మాత్రమే అందుతోందని, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ తదితర విద్యార్హతలు ఉన్నప్పటికీ ఔట్సోర్సింగ్ కార్పొరేషన్‌లో మూడో కేటగిరీలో ఉంచడం వల్ల తక్కువ వేతనం పొందుతున్నామని వివరించారు. జీవో నంబర్ 7 ప్రకారం తమను మొదటి కేటగిరీలో చేర్చాలని కోరారు.

వైద్య మిత్రలకు ఐడీ కార్డులు, యాప్రాన్స్, ట్రావెలింగ్ అలవెన్స్, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రోడ్డు ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్చుర్ పాలసీ అమలు చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేనిపక్షంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమస్యలపై సీఈఓ పద్మావతి సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు కల్పించే ఆలోచనలో ఉందని, వేతనాల పెంపు, కేడర్ సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## శాఖల ప్రగతికి పవన్ దిశానిర్దేశం



**అమరావతి (జర్నలిస్ట్ఫైల్):** తెలుగు ప్రజల గుండెల్లో ఒక ప్రభంజనంగా, కోట్లాది జనుల ఆశయాల్లో ఒక విప్లవంగా నిలిచిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ...

"జీవితం అంటే కేవలం వ్యక్తిగత విజయాలకే పరిమితం కాదు; సమాజం కోసం ప్రశ్నించడం, ప్రజల కోసం నిలబడటం, ఆశయాల కోసం పోరాడటం కూడా జీవిత పరమార్థమేనని తన ప్రయాణంతో నిరూపించిన అసాధారణ వ్యక్తిత్వం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ది . సినీ రంగంలో తనదైన ముద్ర వేసి కోట్లాది అభిమానుల ప్రేమను సంపాదించిన ఆయన, ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు రాజకీయాల్లో అడుగుపెట్టారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తన ఆశయాలను వీడకుండా, నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం పోరాడిన ధైర్యశాలి ఆయన" అని కొనియాడారు. తెరపై హీరోగా అలరించి, నిజ జీవితంలో ప్రజల కోసం నిలబడి, సమాజ మార్పు కోసం జనసేన పార్టీని స్థాపించి నేడు ప్రజాసేవలో తనదైన అధ్యాయాన్ని లిఖిస్తున్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు మరెన్నో మార్పులకు నాంది పలకాలని, ఆయన ఆశయాలు మరెన్నో తరాలకు స్ఫూర్తిగా నిలవాలని, ప్రజల పట్ల ఆయన ప్రేమ, సేవా సంకల్పం చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. "ప్రస్తుతం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యవేక్షిస్తున్న పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర రంగాలు వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుండడమే ఆయన సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనం. గతంలో అధమ స్థానంలో ఉన్న వ్యవస్థలను స్వల్ప కాలంలోనే ప్రథమ స్థానంలోకి తీసుకువచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ కే దక్కుతుంది.

# భూదాన భూముల కోసం బాధితుల పోరుబాట

- వెంటనే సర్వే చేసి పట్టాదారులకు అప్పగించాలి
- కడ్తాల్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా..
- సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆగదు



**కడ్తాల్ సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** భూదాన భూములను సర్వే చేసి పట్టాలు పొందిన బాధితులకు వారి భూములను అప్పగించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.కడ్తాల్ రెవెన్యూ పరిధిలోని 260/9 సర్వే నంబర్‌లో సుమారు 140 ఎకరాల భూమిని సర్వే చేసి,భూదాన పట్టదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.సీపీఎం మండల కార్యదర్శి జే.పెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యులు కందుకూరు జగన్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 20 ఏళ్ల క్రితం 260/9 సర్వే నంబర్‌లోని 140 ఎకరాల భూదాన భూమికి సుమారు 50 మంది భూదాన బాధితులకు పట్టాలు అందజేసినప్పటికీ,ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు భూములను సర్వే చేసి చూపించలేదని ఆరోపించారు.పట్టాలు ఇచ్చిన భూములను వెంటనే సర్వే చేసి బాధితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో భూములు స్వాధీనం అయ్యే వరకు,సర్వే చేసి అప్పగించే వరకు దశలవారీగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.ఇది ఆరంభం మాత్రమేనని,బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.అనంతరం భూదాన భూములకు సంబంధించిన వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కడ్తాల్ ఎమ్మార్వో జయశ్రీకి సీపీఎం నాయకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అబ్బు రమేష్ సీపీఎం మండల కమిటీ సభ్యులు ఆశీర్వాదం, నరసింహ, పర్వతాలు, అశోక్,పాండు,భూదాన పట్టదారులు బాలరాజు ,నరేష్, సత్తయ్య, యాదయ్య, జంగయ్య,చంద్రకళ, భాగ్యమ్మతో పాటు 40 మందికి పైగా బాధితులు,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహాకాళేశ్వర స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



**మల్కాజ్‌గిరి సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్‌గిరి నియోజకవర్గం, నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో నిర్వహించిన మహాకాళేశ్వర శివలింగ పూజా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టీకే శ్రీనివాస్, ఎస్.ఆర్. ప్రసాద్, రాఘవన్, ఆలయ కమిటీ చైర్మన్ నయనపల్లి కనకయ్య, పుట్ట శ్రీనివాస్, కైతి నర్సింగ్, గంగాధర్, గుంటి కృష్ణ, కలకుంట్ల రాములు, పాము వీరేష్, రమణమోని కొండయ్య, కలకుంట్ల శ్రీనాథ్, కలకుంట్ల నవీన్, చింతల శ్రీకాంత్, మహేష్, రాయుడు, ఇందిర ప్రియదర్శిని, ప్రభా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మీటర్లు లేక.. విద్యుత్ కష్టాలు !

- ఇల్లు వచ్చింది.. మీటర్ రాలేదు !
- చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ వాసుల ఆవేదన
- మీటర్ల కోసం విద్యుత్ ఏఈకి వినతి



**కీసర, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు విద్యుత్ శాఖ ఏఈని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటివరకు ప్రతి ఇంటికి ప్రత్యేక విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ వినియోగంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఇంటికి ప్రత్యేకంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బందులు పడకుండా అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. కాలనీ వాసుల వినతిని పరిశీలించిన ఏఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మీటర్ల ఏర్పాటు మరియు విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వనందాస్ రమేష్ గౌడ్, మధు, గణేష్, లక్ష్మయ్య, గోపాల్, రాహుల్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

# జీవో 99తో అన్యాయం జరుగుతోంది

- రోస్టర్ సవరించే వరకు ఉద్యమం: పరశురాం



**కీసర, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు సోమవారం నిర్వహించిన సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరశురాంతో పాటు మాల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. గుజ్జుక పరశురాం మాట్లాడుతూ మాల విద్యార్థులు, ఉద్యోగులకు అన్యాయం చేస్తున్న జీవో 99ను రద్దు చేసి రోస్టర్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లను గ్రూప్-3కు కేటాయించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.కార్యక్రమంలో పడిగం ఆంజనేయులు, గుమ్మడి మురళి, కైరా బాలు, బుర్ఖా వెంకటేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయుడు రాజేశ్వర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మైనంపల్లి




**మల్కాజిగిరి సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆకునూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ కరెడ్ల రాంరెడ్డి సతీమణి ప్రమీల ఇటీవల మృతి చెందడంతో సోమవారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆకునూర్ గ్రామానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమీల కుమారుడు సీనియర్ పాత్రికేయుడు కరెడ్ల రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మాజీ సర్పంచ్ వెలగల రఘువీర్, మత్స్యశాఖ మాజీ చైర్మన్ బోయిని రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీలు సుంకరి శ్రీధర్, పల్లె కనకయ్య, పార్టీ నాయకులు కోయినేని నరసయ్య, మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్‌బాగ్ మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్. ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీఎన్‌వీ సతీష్ కుమార్, సత్యనారాయణ, బాబా, చుంకు శ్రీనివాస్, రాందాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆరు గ్యారంటీలు మనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఆరోపించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం దుండిగల్ సర్కిల్ గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వైఫల్య పాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ఎండగట్టాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ సమరశంఖారావం నిరసన కార్యాచరణను ప్రకటించారు. సెప్టెంబర్ 1: తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై 'ఛార్జ్‌షీట్' విడుదల చేస్తామన్నారు. సెప్టెంబర్ 2: నియోజకవర్గ కేంద్రాల్లో ఆరు గ్యారంటీల అమలు వైఫల్యంపై ధర్నాలు, ప్రజలకు 'బాకీ కార్డుల' పంపిణీ చేయాలన్నారు.సెప్టెంబర్ 3: రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ తదితర సమస్యలపై రైతులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4: మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం హామీల అమలులో వైఫల్యంపై మహిళలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సెప్టెంబర్ 5: నిరుద్యోగులు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై ధర్నాలు, ఆందోళనలు నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 7-10: ప్రజావాణి కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం... కాంగ్రెస్ వైఫల్యాలపై సమరమే ధ్యేయం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు,మహిళా నాయకురాళ్లు,అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



**మియాపూర్, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** మియాపూర్ సర్కిల్ పరిధిలోని స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సిఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ తారానగర్‌లోని హిందూ శ్మశానవాటికలో కనీస వసతులు కల్పించాలని కోరారు. కాలనీ రహదారులు పూర్తిగా ధ్వంసమై, ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సరఫరా సమయాన్ని పెంచడంతో పాటు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొంగర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నర్సు పై అత్యాచారం.. హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- 30 గంటల్లో కేసును చేదించిన పోలీసులు



**శంషాబాద్ సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** తుక్కుగూడలోని ట్రైన్ కేర్ ఆసుపత్రికి చెందిన 21 ఏళ్ల నర్సి పై అత్యాచారం చేసి హత్య చేసిన కీచును పోలీసులు, శంషాబాద్ జోనల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు 30 గంటల్లో చేదించారు. సాంకేతిక ఆధారాలు, దర్యాప్తులో లభించిన సమాచారంతో నిందితుడు ఎండి సానవుల్లా (34) ను అరెస్టు చేశారు. శంషాబాద్ డిసిపి రాజేష్ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. బిఆర్ లోని బిగుసారాయి జిల్లా తూదవులకి చెందిన సనావుల్లా 2023లో హైదరాబాద్కు వచ్చాడు. తుక్కుగూడలోని భాగ్యలక్ష్మి బైక్ మెకానిక్ షాపులో పనిచేస్తూ అక్కడి నివసిస్తున్నాడు. సుమారు నెల రోజులుగా తన దుకాణం వెనుక ఉన్న కిటికీ నుంచి బాధితురాలుని గమనిస్తూ, ఆమె కదిలికలను పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 28న అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో కిటికీనుండి నర్సు గదిలోకి ప్రవేశించాడు. ఆమె మేల్కొని కేకలు వేయడంతో నోరు మూసి గొంతు పట్టుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బాధితురాలు తీవ్రంగా ప్రతిఘటించి నిందితుడి వేలు కొరకడంతో గొంతు ఛాతిపై గోర్లతో వీరినట్లుగా పోలీసులు తెలిపారు. దీంతో ఆగ్రహించిన నిందితుడు ఆమెపై దాడి చేసి గొంతు నిలిమి హత్య చేసినట్లు అనంతరం అత్యాచారానికి పాల్పడిన ట్లు పోలీసులు దర్యాప్తులో పేర్కొన్నారు. ఆగస్టు 29 ఉదయం బాధితురాలు గది నుండి బయటికి రాకపోవడంతో ఆమె స్నేహితురాలు ఇటికీ ద్వారా గదిలోకి వెళ్లి చూడగా రక్త గాయాలతో మృతి చెంది కనిపించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయక కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితుడిని అరెస్టు చేసి సాంసంగ్ మొబైల్ ఫోన్ మొబైల్ ఫోన్ దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ పర్యవేక్షణలో శంషాబాద్ డిసిపి బి రాజేష్, ఆర్జిఐఏ ఏసిపి వి శ్రీకాంత్ గౌడ్ ఆదేశాలతో పాడి షరీఫ్ ఇన్స్పెక్టర్ బి లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది, శంషాబాద్ టాస్క్ ఫోర్స్ బృందం నిందితుడిని అరెస్టు చేసి కేసు చేదించిన సిబ్బందిని శంషాబాద్ డిసిపి రాజేష్ ప్రత్యేకంగా అభినందించారు.

# మైనంపల్లి చొరవతో నెల్సన్ పాల్ పార్థివదేహం స్వస్థలానికి



**మల్కాజిగిరి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్‌గిరిలోని కాకతీయనగర్‌కు చెందిన నెల్సన్ పాల్ తమిళనాడులోని శనివారం వేలాంకన్ని చర్చి సమీపంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వెంటనే స్పందించారు. తమిళనాడు ప్రభుత్వ కలెక్టర్‌తో మాట్లాడి, నెల్సన్ పాల్ పార్థివదేహాన్ని కాకతీయనగర్‌లోని ఆయన స్వగృహానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నిరంజన్ తెలిపారు.అంబులెన్స్ ద్వారా పార్థివదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి అయ్యే ఖర్చులను మైనంపల్లి హనుమంతరావు స్వయంగా భరించనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, అవసరమైన సహాయాన్ని అందించేందుకు చొరవ చూపిన మైనంపల్లి హనుమంతరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు నిర్వహించుకుందాం



**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు శాసనసభ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని మసీదుబండ గ్రామంలో సీనియర్ నాయకుడు మారబోయిన రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, తాజా మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు, మహిళలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృప, ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ బోనాల ఉత్సవాల కోసం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షల నిధులు మంజూరయ్యాయని గాంధీ పేర్కొన్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ మహాధర్నాకు మల్కాజిగిరి సీపీఐ శ్రేణుల పయనం



**మల్కాజిగిరి సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న "బద్లావ్ జరూరీ హై" మహా ధర్నాకు మల్కాజిగిరి సీపీఐ మండల నాయకులు బయలుదేరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి 11 గంటలకు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి ప్రయాణం ప్రారంభించిన నాయకులు, మహా ధర్నాలో పాల్గొని ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించనున్నారు.ఈ బృందంలో జె. వెంకటరమణ, ఎస్.కె. అజీజ్, బి. రాములు, ఎం. వెంకటేష్, టి. రాములు గౌడ్, పి. శ్రీశైలం యాదవ్, బి. అనసూర్య, జె. ఈరమ్మ తదితరులు ఉన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమానికి మల్కాజిగిరి నుంచి సీపీఐ నాయకులు సంఘీభావంగా హాజరవుతున్నట్లు తెలిపారు.

# కడ్తాల్ బోనాల ఉత్సవాలకు సహకరించాలి

- సీఐ సైది రెడ్డికి ఆహ్వానం.. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని వినతి



**కడ్తాల్ సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పట్టణ కేంద్రంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న 2026 బోనాల ఉత్సవాలకు సహకరించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైది రెడ్డిని కలిసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను సీఐ సైది రెడ్డి,సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ కు అందజేశారు.నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న బోనాల ఉత్సవాల తేదీలు,కార్యక్రమాల వివరాలను పోలీసు అధికారులకు వివరించారు.ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి,ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు.గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కడ్తాల్ పట్టణంలో బోనాల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఉత్సవాల షెడ్యూల్ ప్రకారం 5వ తేదీన కాటమయ్య బోనాలు,6వ తేదీన బీరప్ప, పెద్దమ్మ,ఈదమ్మ, మడేలు స్వామి,మైసమ్మ బోనాలు,7వ తేదీన గ్రామదేవత పోచమ్మ బోనాలు,ఉత్సవాలు,8వ తేదీన రేణుక ఎల్లమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.నాలుగు రోజుల పాటు వివిధ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు,బోనాల సమర్పణతో పాటు పలు ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్ల సత్యం యాదవ్,సభ్యులు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్,పట్టణ అధ్యక్షుడు మాలే మల్లేష్ గౌడ్,రామచందర్ నాయక్,చేగురి రాములు,రమేష్ గౌడ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని డివిజన్ల అభివృద్ధే లక్ష్యం

- పార్టీలకు అతీతంగా నల్లగొండ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేస్తాం
- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి



నల్గొండ, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయ పార్టీలు, ఎన్నికల అనంతరం ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్దే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఏ డివిజన్‌పైనా వివక్ష లేదు.తనకు ఏ డివిజన్‌పై ఎలాంటి వివక్ష లేదని, కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు.

**ప్రతిరోజూ ఒక వార్డులో పర్యటన:** ప్రతిరోజూ ఒక వార్డును సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటానని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తానని తెలిపారు.

**సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం:** కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా దశలవారీగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం:** ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని మేయర్ తెలిపారు.ఏ డివిజన్‌లోనైనా సమస్యలు ఉంటే కార్పొరేషన్ సమావేశం దృష్టికి లేదా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశం

- ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతం చేయాలి




నల్గొండ, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్, శాసన పరిషత్ సమావేశ మందిరంలో శాసనమండలి కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ పాల్గొన్నారు.

**కమిటీల ప్రధాన బాధ్యతలపై సూచనలు:**

అంచనాల కమిటీ: ప్రభుత్వ శాఖలకు కేటాయించిన నిధుల వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజాధనం దుబారా కాకుండా తగిన సూచనలు చేయాలి.వన్యప్రాణులు పర్యావరణ కమిటీ: అడవులు, వన్యప్రాణులు, జల వనరులు, గాలి, పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు కృషి చేయాలి. అభివృద్ధ పర్యావరణం మధ్య సమతుల్యత పాటించాలి. సౌకర్యాల కమిటీ: సభ్యుల నివాసాలు, పరిశుభ్రత, నిర్వహణ, ఆహారం, క్యాటరింగ్, వైద్యం, భద్రత తదితర సౌకర్యాలను మెరుగుపరచాలి. మాజీ సభ్యుల వైద్యం, పెన్షన్ సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రంథాలయ కమిటీ: సభ్యులకు చట్టాలు, నివేదికలు, పరిశోధన పత్రాలు, గత చర్చల రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలి. ఆధునిక సాంకేతికతతో గ్రంథాలయాన్ని జ్ఞాన కేంద్రంగా బలోపేతం చేయాలి.గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, సభల్లో పూర్తిస్థాయిలో చర్చకు అవకాశం లేని అంశాలను కమిటీలు లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేయాలని అన్నారు. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజాధనం సద్వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, కమిటీలు కేవలం సమీక్షకులుగా కాకుండా ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేలా విలువైన సూచనలు, సిఫారసులు అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, గ్రంథాలయ వినియోగం, సభ్యుల సౌకర్యాలు, మాజీ సభ్యుల సంక్షేమం, ప్రజాధనం సద్వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు.నూతన కమిటీ చైర్మన్లు, సభ్యులకు చైర్మన్, స్పీకర్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. శాసన పరిషత్ కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు.

## వేములూరు రిజర్వాయర్‌కు జలకళ

- సాగర్ ఎడమ కాలువ జలాలు విడుదల..
- చివరి ఆయకట్టు రైతుల్లో చిగురించిన ఆశలు..



మఠంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : మండల పరిధిలోని యాతవాకిళ్ళ గ్రామం వద్ద ఉన్న వేములూరు రిజర్వాయర్‌కు సాగర్ నీటి విడుదలతో చివరి ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి.నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో వేములూరు రిజర్వాయర్‌కు పొనుగోడు రిజర్వాయర్ ఎస్కేప్ నుంచి సాగు నీటిని ఇరిగేషన్ అధికారులు సోమవారం విడుదల చేశారు.దీంతో వేములూరు వాగు పరిధిలోని కుడి,ఎడమ కాలువల ఆయకట్టు భూములకు ఖరీఫ్ సాగు పనులకు ఢోకా ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితుల వలన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరి పంట సాగుపై ఆందోళన చెందిన రైతులకు సాగర్ జలాల విడుదల ఊరటనిచ్చింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ ఎడమ కాలువలో నీటి ప్రవాహాన్ని అధికారులు పెంచారు.దీంతో కాలువల ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు నీరు చేరుతోంది.

**ఆయకట్టుకు ఊపిరి:** వేములూరు రిజర్వాయర్‌కు సాగర్ నీరు చేరితే కుడి,ఎడమ కాలువల ద్వారా యాత వాకిళ్ళ,హనుమంతుల గూడెం,కామంచి కుంట తండా, చెన్నయ్ పాలెం,వర్ధాపురం, బిల్యానాయక్ తండ, మంచ్య తండా తదితర గ్రామాల పరిధిలో సుమారు 3.5 వేల ఎకరాలు పంట పొలాలకు సాగునీటి ఇబ్బందులు కొంతవరకు తొలగనున్నాయి.ముఖ్యంగా రిజర్వాయర్ ఆధారంతో సాగు చేస్తున్న రైతులకు ఈ నీరు ఎంతో ఉపయోగకరంగా మారనుంది.రిజర్వాయర్‌లో నీటి నిల్వ పెరిగితే పంటలకు కీలక దశలో నీటి కొరత ఏర్పడకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

**చివరి ఆయకట్టు భూములకు నీరందేలా చర్యలు చేపట్టాలి:**

రైతులు సాగర్ నుంచి విడుదలవుతున్న నీటిని పకడ్బందీగా వినియోగించి వేములూరు రిజర్వాయర్ పూర్తి స్థాయిలో 12 అడుగుల మేర ఉన్న చిన్న ప్రాజెక్టును నీటిని నింపి వాగు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాలువల నిర్వహణ,లీకేజీలు కాకుండా పటిష్ట చర్యలు అలాగే నీటి ప్రవాహంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎక్కడా నీటి వృథా జరగకుండా చూడాలని కోరారు.అదే విధంగా నిన్నటి వరకు వేములూరు వాగులో నీళ్ళు లేకపోవడంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పొలాలు నీరందక ఎండిపోయే దశలో ఉన్నాయని ప్రస్తుతం సాగర్ జలాలు వేములూరు రిజర్వాయర్‌కు చేరుతున్న నేపథ్యంలో పంటల సాగుపై నమ్మకం పెరిగిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు .ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆయకట్టు పరిధిలోని చివరి భూములకు నీటిని అందిస్తే పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

# శాశ్వత బస్ స్టాండును ప్రారంభించిన ప్రభుత్వ విప్..

- వంగపల్లి ప్రజల రకాల కోరికను నెరవేర్చిన ఆలేరు మ్మెల్యే..
- స్వయంగా బస్సును నడిపిన బీర్ల అయిలయ్య..

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తూ గ్రామంలో శాశ్వత బస్ స్టాండును సోమవారం రోజు ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత మెరుగు పడేలా బస్ స్టాప్ పాయింట్‌ను ఏర్పాటు చేసి , బస్సు సర్వీసును ప్రారంభించారు. వంగపల్లి గ్రామానికి పర్మినెంట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరగా , వారి విజ్ఞప్తిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సంబంధిత అధికారుల దృష్టికి తీసు కెళ్లారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సహకారంతో వంగ పల్లి గ్రామంలో పర్మినెంట్ బస్ స్టాప్ పాయింట్ ఏర్పాటు చేసి స్వయంగా బస్సు నడిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజల అవసరాలు , సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రతినిధి గా తన ప్రధాన



బాధ్యత అని అన్నారు. వంగ పల్లి గ్రామ ప్రజలు చాలా కాలంగా కోరుతున్న బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇకపై గ్రామ ప్రజలు బస్సుల కోసం ప్రధాన రహదారులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా , గ్రామంలోనే బస్సు ఎక్కే అవకాశం కల్పించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయ డానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోం దని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రైతులు, వ్యాపారులు తదితరులకు ఈ బస్ స్టాప్ ఎంతో ఉపయో గ కరంగా ఉంటుందని అన్నారు. వంగపల్లి ప్రజల కోరిక మేరకు బస్ సర్వీసును ఏర్పా టు చేసి, వారి కోరికను నెర వేర్చినందుకు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. బస్‌స్టాప్ ఏర్పాటు కావ డంతో వంగపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకి , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ఎమ్మెల్యే చొరవను గ్రామస్తులు అభి నందించారు. ప్రజల అవసరాలకు అనుగుణం గా ఆలేరు నియోజకవర్గంలో రవాణా సౌకర్యాల విస్తరణకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు.



# 120 ఇండ్ల సామూహిక గృహప్రవేశాలు..

- ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.
- భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి.

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పనులు పూర్తి చేసుకుని ఉన్న 120 ఇళ్లను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారులతో కలసి సామూ హిక గృహ ప్రవేశాల కార్య క్రమాన్ని సోమవారం రోజు ప్రారంభించి , లబ్ధి దారులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నూతన గృహాల్లోకి ఎమ్మెల్యే గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేద ప్రజలను సంవత్సరాల తరబడి ఎదురుచూపులకు పరి మితం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. ఇళ్ల నిర్మాణం చేపట్టినా వాటిని పూర్తి చేసి అర్హులైన లబ్ధి దారులకు అందించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను



ఆచరణలో అమలు చేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం చేసిందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 3,500 ఇళ్లను మంజూరు చేశాం , 1600 ఇళ్లని పూర్తి చేసాం , కొత్తగా మరో 2,000 ఇళ్లను కేటా యిస్తున్నమన్నారు. ప్రజల సమస్యలు మాకు తెలుసు..అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటాం. సాగునీరు , తాగునీటి కాలువల పను లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.1,500 కోట్లతో భువనగిరి నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగు తున్నాయి. పార్టీ ఏదైనా పర్వాలేదు.. ప్రజలందరూ మాకు సమానమే. రాజ కీయాలకు అతీతంగా అభివృద్ధి , సంక్షేమమే మా లక్ష్యం. గత ప్రభుత్వ హయాంలో కాగితాలకే పరిమితమైన అభివృద్ధి కి భిన్నంగా ,



ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల కళ్లముందే అభివృద్ధి పనులు జరుగు తున్నాయని ఎమ్మెల్యే కుంభం అనిల్ అన్నారు. ఆఖరి మెట్టు ఎక్కితేనే విజయం. ప్రారంభించిన ప్రతి అభివృద్ధి పనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడ మే మా లక్ష్యం. పేదల సంక్షేమం , నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి , అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు , జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేస్ చిస్తి , హౌసింగ్ పీడీ చంద్రకళ , మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డి , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు , మున్సిపల్ కౌన్సిలర్లు , కో-ఆప్షన్ సభ్యులు , అధికారులు , ఇతర ప్రజా ప్రతినిధులు

# ప్రజావాణికి స్పందన కరువు

- 30 గ్రామ పంచాయతీలనుండి వచ్చింది ఒక్కటే దరఖాస్తు
- ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- ప్రజావాణికి డుమ్మా కొట్టిన 10 శాఖల అధికారులు

ఆత్మకూర్ఎస్, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : మండలంలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మండల ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ప్రజల నుంచి కేవలం ఒక్కటే దరఖాస్తు వచ్చింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ప్రజావాణి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. మండల పరిధిలోని 30 గ్రామపంచాయతీల ప్రజలకు ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ, సోమవారం




నిర్వహించిన కార్యక్రమంలో కేవలం ఒక్కరు మాత్రమే దరఖాస్తు సమర్పించడం గమనార్హం.

**అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం:**

ప్రజావాణి పై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమైనట్లు స్పష్టంగా తెలుస్తుంది. మండల పరిధిలోని 30 గ్రామ పంచాయతీల్లో చాలా గ్రామాల ప్రజలకు అసలు ప్రజావాణి నడుస్తుందన్న విషయం కూడా తెలియకపోవడం విస్మయం కలిగిస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో సర్పంచ్, కార్యదర్శి ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**ప్రజావాణికి అధికారుల డుమ్మా:**



మండలంలోని 23 శాఖల మండల స్థాయి అధికారులకు గాను 12 శాఖల అధికారులు మాత్రమే ప్రజావాణికి హాజరయ్యారు. మండల పంచాయతీ రాజ్ అధికారి ట్రైనింగ్ లో ఉండగా, మిగిలిన శాఖల అధికారులు గైరాజరయ్యారని ఇంచార్జ్ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రజావాణికి హాజరుకాని అధికారుల నుండి తప్పకుండా వివరణ తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్ సింగ్ , వ్యవసాయ అధికారి దివ్య , వైద్యాధికారి రమ్య, పశువైద్య శాఖ డాక్టర్ శంకర్, ఇరిగేషన్ ఏఈ చరణ్, ట్రైబల్ వెల్ఫేర్ నుంచి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం..

- డ్రగ్స్ రవాణా విక్రయం వినియోగంపై గట్టి నిఘా పెట్టాలి..
- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు..

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం రోజు అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లడుతూ మత్తు పదార్థాల నియంత్ర ణకు చేపట్టిన చర్యలపై చర్చించి , వాటి నిరోధానికి



అవలంభించాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కాలేజీలలో చదివే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఫ్యాక్టరీలలో పని చేస్తున్న వారిపై కూడా దృష్టి సారించాలన్నారు. ఫ్యాక్టరీలలో ఎంత మంది పని చేస్తున్నారని , అందు లో మన రాష్ట్రం , ఇతర రాష్ట్రం నుండి వచ్చి పని చేసే వాళ్ళు ఎంత మంది పని చేస్తున్నారని తెలుసు కోవాలని , ఫ్యాక్టరీలలో పని చేసే వారి పై నిఘా పెట్టాలని అన్నారు. యువతను , విద్యార్థులను మత్తుకు బానిసలుగా మారుస్తున్న మాదకద్రవ్యాల రవాణా , విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. పోలీస్ , ఎక్సైజ్ , రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కమిటీగా ఏర్పడి పక్కాగా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలను చైతన్య పరచేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలలు , కళాశాలలో డ్రగ్స్ పై కళాశాలలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా ఎక్సైజ్ సూపడెంట్ తుక్యా నాయక్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన పోలీసులను సన్మానించిన జిల్లా ఎస్పీ..

- పదవికి విరామం మాత్రమే-సేవా స్ఫూర్తికి కాదు.
- యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్.

యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ రామకృష్ణ రెడ్డి , ఏఎస్ఐ వీరేశం పదవీ విరమణ సందర్భంగా సోమవారం రోజున వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో మీరు అందించిన సుదీర్ఘ సేవలను , విధి నిర్వహణలో ప్రదర్శించిన అంకితభావం , క్రమశిక్షణ, నిజాయితీ , వృత్తి నిబద్ధత , ప్రజాసేవా దృక్పథాన్ని అభినందించారు. ప్రజల భద్రత , శాంతి భద్రతల పరిరక్షణలో వారు అందించిన సేవలు పోలీస్ శాఖకు విలువైనవని , వారి



అనుభవం..సేవా స్ఫూర్తి యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు , ప్రజలకు అంకితభావంతో సేవలందించినందుకు ఎస్ఐ రామకృష్ణ రెడ్డిశ, ఏఎస్ఐ వీరేశంలకు జిల్లా పోలీస్ శాఖ తరపున ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. విరమణ అనంతరం వారు తమ



కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యకరమైన , ప్రశాంతమైన , సంతోష కరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ ఎస్పీ శుభాకాంక్షలు తెలుపుతూ పదవికి విరామం మాత్రమే-సేవా స్ఫూర్తికి కాదు. మీ సేవా వారసత్వం పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ

## వేద సంకల్ప సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుంకుమ పూజా



**అశ్వారావుపేట, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం తిరుమలకుంట పంచాయతీ తోగూడెం గ్రామం లో శ్రావణమాసం పురస్కరించుకొని శ్రావణ సోమవారం రోజున వేద సంకల్ప సేవాట్రస్ట్ మరియు దానధర్మం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ఇంచార్జ్ గిద్దా కొండయ్య ఆధ్వర్యంలో కుంకుమ పూజా కార్యక్రమాన్ని వేద పండితుల అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగింది.పూజా కార్యక్రమం లో కూర్చున్న మహిళలందరికీ పసుపు కుంకుమలతో చీరలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి గ్రామస్తులు గ్రామ పెద్దలు అందరూ పాల్గొని విజయవంతం చేసినారు.

## ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ
## కార్యదర్శిగా చండీశ్వరి దేవి



**ములుగు, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శిగా కె. చండీశ్వరి దేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.పదోన్నతి ప్రాతిపదికన యాదాద్రి భువనగిరి జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఆమె ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది నూతన కార్యదర్శి కె.చండీశ్వరి దేవికి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం తన ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు.లోక్అదాలత్‌లు,న్యాయ అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి, న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వివిధ న్యాయ సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

## GDK-11A గనిలో రూఫ్ ఫాల్.. ఎలాంటి ప్రమాదం లేదు



**రామ్‌మందిర్ ఏరియా, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
రామగుండం ఏరియా-1 పరిధిలోని GDK-11A గనిలో ఆదివారం రాత్రి బొగ్గు రూఫ్ ఫాల్ (పైకప్పు కూలడం) సంఘటన చోటుచేసుకుంది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదని సింగరేణి ప్రజా సంబంధాల విభాగం వెల్లడించింది. ఆదివారం (ఆగస్టు 30) రెండో షిఫ్ట్‌లో రాత్రి సుమారు 7 గంటల సమయంలో Continuous Miner-1 ప్యానెల్‌లో యంత్రం పనిచేస్తున్న ప్రాంతంలో బొగ్గు రూఫ్ కూలినట్లు అధికారులు తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో ఎలాంటి కార్మికులు లేదా ఇతర వ్యక్తులు లేరని పేర్కొన్నారు. Continuous Miner ను ఆపరేటర్ సురక్షితమైన ప్రదేశంలో ఉండి రిమోట్ కంట్రోల్ ద్వారా నిర్వహిస్తున్నందున ఎలాంటి ప్రమాదం జరగలేదని వివరించారు. సపోర్టులు లేని గోఫ్ ప్రాంతంలో జశీత్‌అఅబశీబం వీఅఅవతీ పనిచేస్తున్న సమయంలో భౌగోళిక ఒత్తిడి కారణంగా బొగ్గు రూఫ్ అప్పుడప్పుడు సహజంగా కూలిపోయే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటన కూడా అదే కారణంగా జరిగినట్లు పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా రాత్రి 11 గంటల సమయంలో Continuous Miner ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి హాని జరగలేదని, గనిలో బొగ్గు ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతోందని సింగరేణి అధికారులు స్పష్టం చేశారు.

## కల్వకోటలో కొలువుదీరనున్న రేణుక ఎల్లమ్మ తల్లి
### ఘనంగా శంకుస్థాపన, భూమిపూజ.. హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





**వేములవాడ, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణం గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షగా నిలిచిందని, ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని గౌడ సంఘం సభ్యులు తెలిపారు. ఆలయం భవిష్యత్ తరాలకు కూడా ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచేలా నిర్మాణాన్ని చేపట్టాలని సంకల్పించారు. ఈ సందర్భంగా గౌడ కుల సంఘ సభ్యులు మాట్లాడుతూ.. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కుల సంఘ సభ్యులు కల్వకోట జి. రమేష్, జి. ప్రశాంత్, పి. లక్ష్మణ్, డి. వెంకట రమణ నాగెల్లి గంగాధర్ కుంట మహేష్,పి గణేష్, జి గంగాధర్, సతీష్,సర్వాయి పాపన్న గీతక కార్మిక జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని మల్లేశం గౌడ్,తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## పోలీసుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

-హెచ్ఆర్ఎంఎస్‌లో సిబ్బంది హెల్త్ ప్రొఫైల్స్
-వైద్య శిబిరాన్ని పరిశీలించిన సీపీ ఎం.రమేష్



**సైబరాబాద్, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిరంతర విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిడికి గురయ్యే పోలీసుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ సీటీసీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సీపీ డాక్టర్ ఎం.రమేష్ సోమవారం పరిశీలించారు. ఎస్‌సీఎస్‌సీ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల దాకా కొనసాగే ఈ శిబిరంలో ఆయన స్వయంగా కంటి, బీపీ పరీక్షలు చేయించుకుని వైద్య సేవల తీరును పర్యవేక్షించారు. ఎత్తు, బరువు, బీఎంఐ, ఈసీజీ, దంత పరీక్షలతో పాటు చిన్నారులకు ప్రత్యేక ఐ స్క్రీనింగ్, ఫిజియోథెరపీ తదితర సేవలు అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో పాటు ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో సిబ్బంది ఆరోగ్య వివరాలను భవిష్యత్ అవసరాల కోసం 'ఆరోగ్య భద్రత' ప్రొఫైల్‌లో నమోదు చేసి హెచ్ఆర్ఎంఎస్‌లో డిజిటల్‌గా నిక్షిప్తం చేయాలని యూనిట్ వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, ఎస్‌సీఎస్‌సీ సీఈవో నవీద్, అదనపు డీసీపీ షమీర్, వైద్యులు సుకుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి ప్రజావాణికి 23 ఫిర్యాదులు

- ఫిర్యాదు దారులు మండల ప్రజావాణిని వినియోగించుకోవాలి
- ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో పని చేయాలి - ఎంపీడీవో ఎం.డి.రహీముద్దీ




**జీడీమల్లంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ శాఖలకు చెందిన 14 మంది అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి సమస్యలు,ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజావాణిలో మొత్తం 23 ఫిర్యాదులు అందాయని,వీటిలో హౌసింగ్ శాఖకు 10,ఇరిగేషన్ శాఖకు 6,తహసీల్దార్ కార్యాలయానికి 5,ఏఈ/ఆర్‌డబ్ల్యూఎస్‌కు 1,ఎంపీవోకు 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని మల్లంపల్లి ఎంపిడిఓ ఎం.డి.రహీముద్దీ తెలిపారు.ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని,అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగకరంగా ఉందని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో మల్లంపల్లి మండల వివిధ శాఖల అధికారులు,పిర్యాదు దారులు పాల్గొన్నారు.

# అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి

- తమ భూమిని ఇతరుల పేర్లపై పట్టా చేశారని ఆరోపణ
- ప్రజావాణి లో అధికారులకు బాధితుల ఫిర్యాదు



**జీడీమల్లంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
జేడి మల్లంపల్లి మండలం రామచంద్రాపురం శివారులోని సర్వే నంబర్ 3293లో తమ కుటుంబానికి చెందిన భూమిని తమకు తెలియకుండా ఇతరుల పేర్లపై అక్రమంగా పట్టా చేశారని ఆరోపిస్తూ భూమ స్వామి కుటుంబ సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు.అక్రమంగా జరిగిన పట్టా మార్పిడులను రద్దు చేసి తమ భూమిని తమ పేర్లపై పట్టా చేయాలని కోరారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. బొల్లోనపల్లి గ్రామానికి చెందిన భూమ స్వామి తండ్రి భూమ లక్ష్మయ్య పేరున సర్వే నంబర్ 3293, ఖాతా నంబర్ 1517లో 2 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు.ఈ భూమిని తమ కుటుంబం సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నట్లు పేర్కొన్నారు.అయితే తమకు ఎలాంటి సమాచారం,అనుమతి లేకుండా భూమిలోని 1 ఎకరం 32 గుంటలను ఇతరుల పేర్లపై పట్టా మార్పిడి చేసినట్లు ఆరోపించారు.రామచంద్రాపురం గ్రామానికి చెందిన మార్త సదానందం,తండ్రి రాజయ్య తమ భూమిలోని 0.36 గుంటలను క్యాతం ప్రవళిక,భర్త రమేష్ పేర్లపై పట్టా చేయించినట్లు,మరో 0.36 గుంటలను ఓ మైనింగ్ పేరున పట్టా చేయించినట్లు ఫిర్యాదులో తెలిపారు.సదరు భూమిలో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు సమస్య పరిష్కారానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడమే కాకుండా తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.అధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూమి రికార్డులను పరిశీలించి,అక్రమ పట్టాలను రద్దు చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.
ఫిర్యాదు చేసిన వారిలో భూమ స్వామి, స్వరూప, జనార్దన్, చంద్రమౌళి, కవిత, ప్రవీణ్, పూల, సతీష్, మేఘ అర్జున్, సందీప్ ఉన్నారు.

# శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాం
- కమిటీని ప్రకటించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి



**జీడీమల్లంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
శ్రీనగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనతో మల్లంపల్లి మండలం శ్రీనగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు.మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గుగులోతు లచ్చిరాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కొట్టే ఆనందం,ప్రధాన కార్యదర్శిగా పంచగిరి రాజు,సహాయ కార్యదర్శిగా బానోతు మోహన్, కోశాధికారిగా బిలావత్ దేస్య ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా అజ్మీర రాజేందర్, గుగులోతు బిక్షపతి, గుగులోతు సుందర్, తోట కిరణ్‌రాజ్, దాసరి రాజయ్య, మొగిలగాని రమేష్, బిలావత్ దస్య తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి,కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాకిటి రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, జోషి, రాము, జింక వేణు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీ గ్రామంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.రాబోయే ఎన్నికల్లో శ్రీనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# హామీలను వెంటనే అమలు చేయాలి
### బీఆర్ఎస్ మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్



**జీడీమల్లంపల్లి, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలు,13 డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మల్లంపల్లి మండలాధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు ఆదేశాల మేరకు మల్లంపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 1000 రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.100 శాతం రైతు రుణమాఫీ,మహాలక్ష్మి పథకం,నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీల వంటి హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు.ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మల్లంపల్లి మండలం నుంచి కనీసం 300 మంది కార్యకర్తలు పాల్గొనేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్,మల్లంపల్లి టౌన్ అధ్యక్షుడు చీదర సంతోష్,యూత్ అధ్యక్షుడు మొర్రి రాజు యాదవ్,మాజీ ఎంపీటీసీలు మాచర్ల ప్రభాకర్,జెన్నారపు శ్రీనివాస్,మాజీ సర్పంచులు మధ్యవేణి రాములు, బోరాల రాజేశ్వరరావు, గుగులోత్ రాములు, తిరుపతి, సీనియర్ నాయకులు బత్తోజు ద్రోణాచారి, ఎండి చోటు,రేణిగుంట్ల సురేష్, జానీ,ఎండి పాషా,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకే ఐకాన్ అవార్డులు
### వెలుగు సంస్థ చైర్మన్ డా. సురభి శ్రీధర్

**రామ్‌మందిర్ ఏరియా, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, వారి ప్రతిభకు గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఐకాన్ అవార్డులను అందిస్తున్నట్లు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, చైర్మన్ డా. సురభి శ్రీధర్ తెలిపారు.
హైదరాబాద్ కింగ్‌కోటి, తిలక్‌రోడ్‌లోని బొంగులకుంట తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ సంస్థల ఫౌండర్, చైర్మన్ లయన్ డా. ఆకుల రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
సామాజిక సేవ, ప్రజా సేవ, పారిశ్రామిక రంగం, స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలందిస్తున్న పలువురికి ఈ సందర్భంగా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. సురభి శ్రీధర్‌తో పాటు డా. గూడూరి చెన్నారెడ్డి, డా. కుంట సురేష్, డా. కోడెల మంజుల, డా. పి.జి. సుదర్శన్ తదితరులు హాజరయ్యారు.
పంజాల శివకుమార్‌కు బిజినెస్ ఐకాన్ అవార్డు
యువ పారిశ్రామికవేత్త, లియో లైఫ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత పంజాల శివకుమార్‌కు ఈ సందర్భంగా బిజినెస్ ఐకాన్ అవార్డును అందజేశారు. చిన్న వయసులోనే వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి, స్వయంకృషితో సంస్థను స్థాపించి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న శివకుమార్ సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
అనంతరం అవార్డు గ్రహీత పంజాల శివకుమార్ మాట్లాడుతూ.. తన విజయ ప్రస్థానంలో ఈ ఐకాన్ అవార్డు తొలి అడుగుగా భావిస్తున్నానన్నారు. అవార్డుకు సహకరించిన వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డా. సురభి శ్రీధర్‌కు,




అవార్డును అందించిన డా. ఆకుల రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.శివకుమార్‌కు బిజినెస్ ఐకాన్ అవార్డు లభించడంపై లియో లైఫ్ సంస్థ సభ్యులతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# విధులకు వీడ్కోలు.. సేవలకు సత్కారం



**సైబరాబాద్, సెప్టెంబరు 01 (జర్నలిస్ట్ ఫైల్) :**
సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు విధి నిర్వహణలో విశేష సేవలందించి సోమవారం పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులకు సీపీ కార్యాలయంలోని ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు పలికారు.
కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఎస్సై ఎం. రవీందర్ రెడ్డి, సైబరాబాద్ ఎస్‌బీ ఎస్సై పి. విజయ్ భాస్కర్ రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆర్ఎస్ఐ ఫరీద్ ఖాన్, అత్తాపూర్ ఏఎస్సై టి. కేశవులు, బాలానగర్ ట్రాఫిక్ హెచ్‌జీ ఏబీ శర్మలను పోలీస్ శాఖ తరఫున సత్కరించి ఆత్మీయంగా సాగనంపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో మరో కొత్త అధ్యాయానికి నాంది అని, కుటుంబ సభ్యుల అండదండలతోనే పోలీసులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారని గుర్తుచేశారు. రిటైర్మెంట్ తర్వాత సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కుటుంబంతో ఆనందంగా గడపాలని సూచించారు. నగర అభివృద్ధిలో భాగస్వాములైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక ప్రయోజనాలను భవిష్యత్తు అవసరాల కోసం జాగ్రత్తగా మదుపు చేసుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా సైబర్ మోసగాళ్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, అనుమానాస్పద లింకులు అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.
సుదీర్ఘ అనుభవం గల విశ్రాంత అధికారులు భవిష్యత్తులోనూ శాఖకు తమ సలహాలు, సూచనలు అందించాలని కోరుతూ వారి జీవితం ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, ఎస్బీ డీసీపీ సుధీంద్ర, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అదనపు డీసీపీ షమీర్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సేవా సంకల్ప ఉత్సవాల్లో ఘనంగా 76 వేల లేఖల కార్యక్రమం

- ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు
- మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి, సంస్కరణల దిశగా పయనం
- కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని వీఐటీ–ఏపీ అమరావతిలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 76 వేల లేఖల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 76 వేల పోస్ట్‌కార్డుల ద్వారా ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాన్ని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పణతల సురేష్ తదితరులు పాల్గొన్నారు. 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని 76 వేల లేఖలతో శుభాకాంక్షలు తెలియజేయడం సేవాభావానికి, దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రేమతో రాసిన చిన్న పోస్ట్‌కార్డు కూడా ఒక వ్యక్తికి ఎంతో బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. 2014కు ముందు దేశం తీవ్ర పేదరికం, నిరుద్యోగం, మౌలిక వసతుల కొరత వంటి అనేక సమస్యలను ఎదుర్కొందని పేర్కొన్నారు. అనేక బ్యాంకులు ఎన్‌పీఏల కారణంగా దివాలా తీసే పరిస్థితికి చేరుకున్నాయని, యువతకు భవిష్యత్తులో ఉద్యోగాలు కల్పించేందుకు స్పష్టమైన విజన్, ప్రణాళిక అప్పట్లో లేకపోయిందని అన్నారు. దేశం ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సవాళ్లకు తగిన వ్యూహం అవసరమైన నేపథ్యంలో ప్రజలు ఆశతో నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారని తెలిపారు. అనంతరం మోదీ ప్రభుత్వం అనేక కీలక సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు.

గతంలో కోట్లాది మందికి బ్యాంకు ఖాతాలు కూడా లేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం దాదాపు ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని పెమ్మసాని తెలిపారు. బ్యాంకింగ్ రంగాన్ని ఏకీకృతం చేసి మరింత పటిష్టం చేశామని, దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా, సంక్షోభాలకు తావులేకుండా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో పన్నులు చెల్లించే ప్రక్రియలో అవినీతి, లంచాల పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం పన్నుల వ్యవస్థను డిజిటలైజ్ చేసి పారదర్శకంగా మార్చామని వివరించారు. కాలానుగుణంగా మారాల్సిన క్రిమినల్ చట్టాలు, లేబర్ కోడ్స్, టెలికాం తదితర రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పారు.

గతంలో టెలిఫోన్ కనెక్షన్ కోసం ఎంపీలు, ఎమ్మెల్యేల సిఫార్సులు అవసరమయ్యేవని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4జీ, 5జీ నెట్‌వర్క్ విస్తరించిందని పెమ్మసాని అన్నారు. సంస్కరణల ఫలితంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, మొబైల్ ఫోన్ల తయారీలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి ఎదిగిందని తెలిపారు. తయారీ రంగంలో గతంలో ఉన్న అనేక పన్నులను సరళీకృతం చేసి వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. గతంలో దేశం ఎదుర్కొన్న కష్టాలను మర్చిపోకుండా, గత 10--15 ఏళ్లలో వచ్చిన మార్పులను ప్రజలు గమనించాలని కోరారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై ప్రజలు కనీసం 10 నిమిషాలైనా తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ ప్రాధాన్యత పెరుగుతోందని, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ఠ మరింత బలపడుతోందని, మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి, సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశంలో కమ్యూనికేషన్స్‌కు పోస్టల్ వ్యవస్థ ప్రధాన ఆధారంగా ఉందన్నారు. ప్రధానమంత్రి మోదీ 75వ జన్మదినం సందర్భంగా పోస్ట్‌కార్డుల ద్వారా శుభాకాంక్షలు తెలియజేయాలని గతంలో నిర్ణయించుకున్నామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది 76 వేల లేఖల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కష్టపడే మనస్తత్వం నరేంద్ర మోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రధానమంత్రిగా నిలిపిందన్నారు. ప్రతి ఒక్కరూ 'నేను భారతీయుడిని' అని గర్వంగా చెప్పుకునేలా మోదీ దేశాన్ని నడిపిస్తున్నారని పేర్కొన్నారు.

మోదీ 25 ఏళ్ల రాజ్యాంగ పదవుల ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ, 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా కలిపి సుమారు 25 సంవత్సరాల పాటు రాజ్యాంగ పదవుల్లో సేవలందించడం అరుదైన ఘట్టమన్నారు. ఆయనను స్థిరమైన, నిరంతర ప్రజా కమ్యూనికేటర్‌గా అభివర్ణించారు.

ఈ 25 ఏళ్లలో దేశంలో ఐదు ప్రధాన మార్పులు చోటుచేసుకున్నాయని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గౌరవం పెరగడం, ఆర్థిక సమృద్ధి, సైనిక శక్తి--ఆత్మనిర్భర్ భారత్, ప్రపంచ సంక్షోభాల్లో భారత పాత్ర, భారత నాగరికతతో ప్రపంచానికి మరింత అనుబంధం ఏర్పడటం ముఖ్యమైన మార్పులని వివరించారు. భారతీయులు, పీఐఓలు ప్రపంచవ్యాప్తంగా 'మేము భారతీయులం' అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్థిక సర్వే ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి మధ్య కూడా దేశం అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశీయ రక్షణ ఉత్పత్తులు, మిసైల్స్, ఆర్టిలరీ గన్స్ వినియోగం పెరిగిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఆపరేషన్ సింధూర్, సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా భారత సైనిక సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందన్నారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారతీయ విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడంలో భారత దౌత్య వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. దక్షిణాసియా, తూర్పు ఆసియా దేశాలతో భారతదేశానికి ఉన్న నాగరికత సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పణతల సురేష్, బీజేపీ స్టేట్ ప్రోటోకాల్ ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మల కిషోర్, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, చీఫ్ పోస్టుమాస్టర్ బి.పి. శ్రీదేవి, శివరాం, వీఐటీ–ఏపీ వైస్ ఛాన్సలర్ అరుల్ మోజివరమ్, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



- పోతుమర్రులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** వేమూరు మండలం పోతుమర్రు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు నేరుగా అందించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన నక్కా ఆనంద బాబు వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ ద్వారా ఎదురవుతున్న సమస్యలు, గ్రామంలో ఉన్న మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పింఛన్ల పంపిణీ కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, పేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందనే విశ్వాసాన్ని కల్పిస్తోందని పేర్కొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అర్హులకు అన్యాయం జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టడం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తోందని అన్నారు.

పోతుమర్రులో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించడం పట్ల వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకోవడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జీలు, అనుబంధ విభాగాల నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలి



- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. పద్మశాలిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో గ్రేట్ న్యాల్టీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంగవైకల్యంతో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. సుమారు 40 మంది లబ్ధిదారులకు ఆమె చేతుల మీదుగా సామగ్రి అందించారు. వ్యాధిగ్రస్తుల అరికాళ్ల పుండ్లను శుభ్రం చేయడంతో పాటు చేతులు, కాళ్లు వంకర్లు పోయిన వారికి వ్యాయామాలు చేయించారు. ప్రతి ఒక్కరికీ దుప్పటి, స్టీల్ ప్లేటుతో పాటు భోజన సదుపాయం కల్పించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు దాతలు సహాయం చేయడం అభినందనీయమని డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించి మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఈరుగుల అన్నపూర్ణ, వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, సంస్థ వ్యవస్థాపకులు వంగర హేమ్‌చంద్, ఫిజియోథెరపిస్టు శివ, మన్నవ రామకృష్ణ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు జర్మనీ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

## ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగుల నిరసన



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా ఉద్యోగులు రెండో రోజు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎన్టీఆర్ కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్టీసీ డిపోలు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, పౌరసరఫరాల శాఖ, గ్రామ, వార్డు సచివాలయాలు, సహకార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ, పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయం తదితర కార్యాలయాల ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

ఉద్యోగులు తమ వాట్సాప్ డీపీలను 'సీఎం గారు.. మా డబ్బులు మాకు ఇవ్వండి' అనే సందేశంతో మార్చుకుని నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ బత్తిన రామకృష్ణ, జనరల్ సెక్రటరీ వైఎస్ రావు ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- నగర కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బ్రాడీపేట, కాకుమానువారి వీధి, లాంచెస్టర్ రోడ్, సంపత్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న, పూర్తయిన అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల మధ్య సమన్వయంతో పనులను వేగంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రారంభించిన పనులు పెండింగ్‌లో లేకుండా కాంట్రాక్టర్లతో నిర్ణీత సమయంలో పూర్తి చేయించేలా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్మాణ సమయంలో ఏర్పడే వ్యర్థాలను వెంటనే తొలగించాలని, రోడ్లు--డ్రైన్ల మధ్య లెవల్స్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్రాడీపేటలో తాగునీటి శాంపిల్స్ సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎమినిటీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్ఈని ఆదేశించారు. రోడ్లపై నిర్మాణ సామగ్రిని ఉంచిన వారికి పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేయాలని ఏసీపీని ఆదేశించారు.

నగరంలోని ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను కూడా కమిషనర్ పరిశీలించారు. నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. లాంచెస్టర్ రోడ్ ప్రధాన డ్రైన్‌లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని సూచించారు. పర్యటనలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈలు విష్ణు, వేణు, డీఈఈలు వెంకటరమణ, సతీష్, చైతన్య, ఏసీపీ రెహ్మాన్, ఎస్–ఎస్ ఆయూబ్ ఖాన్‌తో పాటు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రైతు బజార్లలో తగ్గింపు ధరలతో బియ్యం విక్రయాలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా రైతు బజార్లలో తగ్గింపు ధరలతో బియ్యం విక్రయాలు జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ధరల పర్యవేక్షక కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు బజార్లలో తగ్గింపు ధరలతో రెండు రకాల బి.పి.టి (ద్రూ) బియ్యం – స్టీమ్ మరియు పచ్చి బియ్యం విక్రయించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు కానీ లేదా రేషన్ కార్డు కానీ చూపించి 10 కేజీలు వరకు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫెడ్ ద్వారా వంట నూనెలు తగ్గింపు ధరలలో రైతు బజార్లలో అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. ఉల్లిపాయల విక్రయాలు విక్రయాలు పట్ల పౌరసరఫరాల కమిషనర్ ను కోరడం జరుగుతుందన్నారు.

ఆహార సలహా సంఘం సభ్యులు హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశముల మేరకు జిల్లాలో స్టీమ్ మరియు పచ్చి బియ్యం కౌంటర్లు పెట్టి తగ్గింపు ధరలలో ప్రజలకు అందుబాటులో ఉంచినందుకు జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. బహిరంగ విఫణిలో పంచదార, ఉల్లిపాయలు, నూనెలు, బెల్లం ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. సామాన్య ప్రజానీకానికి ఊరట కల్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు పి.సత్యనారాయణ చౌదరి, తూనికల కొలతలు, కమర్షియల్ టాక్స్, ఫుడ్ సేఫ్టీ, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## పింఛన్ అంటే ఆత్మీయ భరోసా : ఎమ్మెల్యే నసీర్

- అభాగ్యులకు మేమున్నామనే ధైర్యం
- పింఛన్లు రెట్టింపు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే..
- వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లు పెంచుతామని మోసం
- ఇప్పటికే రూ.30 కోట్ల విలువైన పింఛన్ల పంపిణీ
- కిస్టియన్ పేటలో పింఛన్లు అందజేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒకటో తేదీ ఉదయాన్నే అవ్వతాతల ముఖాల్లో ఆనందం చూస్తున్నామని, ఇదొక పండుగ రోజని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక క్రిస్టియన్ పేటలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ప్రతి ఇంటికీ పింఛన్ వస్తుందా ? ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ తీసుకున్న లబ్ధిదారులు ఒకటో తేదీన ఇంటికి పెద్ద కొడుకులా తమను సీఎం చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా పింఛన్ అందిస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. మన పక్క రాష్ట్రమైన తెలంగాణలో కేవలం రూ. 2వేలు మాత్రమే పింఛన్ ఉంటే ఏపీలో రూ.4 వేలు అందిస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ.6 వేలు, ప్రత్యేక పరిస్థితుల్లో వారికి రూ.10 వేలు, రూ.15 వేలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 వేల కోట్ల విలువైన పింఛన్లు అందించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎరియర్స్ తోపాటు పింఛన్లు రెట్టింపు చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచి లబ్ధిదారులను మోసం చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో కుటుంబంలో ఎవరైనా పింఛన్ తీసుకుంటూ ఎవరైనా మరణిస్తే భాగస్వామికి మరుసటి నెలలో స్పౌజ్ కేటగిరీలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని, ఇది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని పింఛన్లు స్వయంగా మంజూరు చేయించామన్నారు.

## భక్తులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగించకండి



- వాహన,దుకాణదారులకు సూచనలు చేసిన ఎస్ఐ శివప్రసాద్

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంకి విచ్చేయు భక్తులకు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటర్లో ఉన్న దుకాణ దారులకు మరియు వాహనదారులకు స్థానిక ఎస్సై మరియు వారి సిబ్బంది కలిసి సలహాలు సూచనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటర్ నందు వాహనాలు నిలిపేవారు బ్రహ్మంగారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. అలాగే ఐదు రోడ్ల సెంటర్ నందు వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నా ప్రతి ఒక్కరూ ప్రజలకు భక్తులకు ఇబ్బంది లేకుండా వ్యవహరించాలని తెలిపారు.

## సర్వాయపల్లిలో "పొలం పిలుస్తోంది"



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** కడప జిల్లా మైదుకూరు మండలం సర్వాయపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ సమన్వయంతో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కడప కోఆర్డినేటర్ డా. ఎన్. కృష్ణ ప్రియ పాల్గొని రైతులకు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గ్రామంలోని పసుపు పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం పసుపు పంట శాఖీయ వృద్ధి దశలో ఉందని పంట కొంత పెట్ట పరిస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. పంటలో ఆకు మచ్చ తెగులు లక్షణాలను గమనించి నివారణకు సాఫ్ శిలీంద్రనాశినిని లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

అలాగే పంట ఎదుగుదలకు అవసరమైన పోషకాలను అందించేందుకు 19:19:19 నీటిలో కరిగే ఎరువును ఎకరాకు 1 కిలో చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంటకు తగిన సమయంలో సమతుల్య పోషక యాజమాన్యం పాటించాలని రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో మైదుకూరు మండల వ్యవసాయ అధికారి శివ శంకర్ రెడ్డి రైతులకు ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ మరియు ఈ–క్రాప్ బుకింగ్ గురించి వివరించారు. రైతులు తమ పంట వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ గురప్ప వీఏఏ మరియు సర్వాయపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎస్ఆర్ఎంలో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్



- సైబర్ దాడుల నియంత్రణకు యాంటీ హ్యాకింగ్ సెల్స్ అవసరం
- వీసీ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మంగళవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు 'సైబర్ నోవా-2026' పేరిట సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు గూగుల్ డెవలపర్స్ గ్రూప్ సహకారం అందించింది.

ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల్లో సైబర్ సెక్యూరిటీపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, సైబర్ దాడులను ఎదుర్కొనే నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ దాడులను సమర్థవంతంగా నియంత్రించేందుకు యాంటీ హ్యాకింగ్ సెల్స్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. కృత్రిమ మేధస్సును సమగ్రంగా వినియోగించుకునే విధంగా సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఇండియన్ సర్వర్స్ సీఈఓ డి. సాయి సతీష్ విద్యార్థులకు సైబర్ దాడుల తీరుతెన్నులు, వాటిని గుర్తించడం, నియంత్రించడం, సైబర్ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర కీలక అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, వర్క్‌షాప్ నిర్వాహకులు డాక్టర్ నాగస్రవంతి, డాక్టర్ మణికందన్ తదితరులు డి. సాయి సతీష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విజయవాడలో 'సరస్-2026' నిర్వహణకు స్థల పరిశీలన

- పున్నమి ఘాట్‌ను పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎంపీ కేసినేని చిన్ని
- 700కుపైగా స్టాళ్ల ఏర్పాటు.. జాతీయ స్థాయిలో నిర్వహణకు సన్నాహాలు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరులో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'సరస్-2026' కార్యక్రమాన్ని విజయవాడలోనూ ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణకు అనువైన ప్రదేశాలను పరిశీలించేందుకు గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) మంగళవారం పున్నమి ఘాట్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. సరస్ మేళా నిర్వహణకు అనువుగా ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించనున్న సరస్-2026లో 700కుపైగా స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు తమ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల మహిళా స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతో పాటు నగరవాసులకు వాటిని అందుబాటులోకి తీసుకురావడమే సరస్ మేళా ప్రధాన ఉద్దేశమన్నారు.

పున్నమి ఘాట్ పరిసరాల్లో స్టాళ్ల ఏర్పాటుకు అనుకూలత, అవసరమైన మౌలిక వసతులు, సందర్శకులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను కేంద్ర మంత్రి, ఎంపీ పరిశీలించారు. కార్యక్రమానికి లక్షలాది మంది సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

సరస్-2026ను కేవలం విక్రయ మేళాగా కాకుండా జాతీయ స్థాయిలో గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు వేదికగా నిలిచేలా నిర్వహించాలని పెమ్మసాని అధికారులకు సూచించారు. వివిధ రాష్ట్రాల మహిళా సంఘాలు తయారు చేసే ప్రత్యేక ఉత్పత్తులకు విజయవాడలో మార్కెట్ కల్పించడం ద్వారా వారికి ఆదాయం, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. మేళాకు వచ్చే సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా అన్ని ఏర్పాట్లను ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని ఆదేశించారు.

విజయవాడలో సరస్-2026ను విజయవంతంగా నిర్వహించి గ్రామీణ మహిళల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు వారి ఆర్థిక సాధికారతకు మరింత ఊతమిచ్చేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దాలని పెమ్మసాని చంద్రశేఖర్, కేసినేని చిన్ని అధికారులకు సూచించారు.

## మంత్రి లోకేష్ నరసరావుపేట పర్యటనను విజయవంతం చేయాలి



- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు

**సత్తెనపల్లి (జర్నలిస్ట్ ఫైల్ ):** సెప్టెంబర్ 2న నరసరావుపేటలో మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, పర్యటనకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించే అంశంపై నాయకులతో చర్చించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ నరసరావుపేటలో నిర్వహించనున్న నారా లోకేష్ పర్యటనకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సంఘీభావం తెలియజేయాలని సూచించారు.

జనసమీకరణ, కార్యక్రమ ఏర్పాట్లు, నాయకులు-కార్యకర్తల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించి పర్యటనను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

సెప్టెంబర్ 2న నరసరావుపేటలోని జేఎన్‌టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో హాస్టళ్ల ప్రారంభోత్సవం, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు తెలుగుదేశం పార్టీ క్యాడర్‌తో సమావేశం జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జేఏసీ అమరావతి నిరసనలు

- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన
- "సీఎం సార్... మా డబ్బులు మాకు ఇవ్వండి" నినాదంతో వాట్సాప్ డీపీలు, స్టేటస్‌లు



**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన సమస్యలు, పెండింగ్ బకాయిలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ అమరావతి చేపట్టిన తొలి దశ ఉద్యమ కార్యాచరణ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా గ్రామ సచివాలయాల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయాల వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. వేలాది మంది ఉద్యోగులు తమ సెల్‌ఫోన్‌లలో "సీఎం సార్... మా డబ్బులు మాకు ఇవ్వండి" అనే నినాదాన్ని వాట్సాప్ డీపీగా, స్టేటస్‌గా పెట్టుకుని ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేశారు.

గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, వెటర్నరీ శాఖ, ఆర్టీసీ డిపోలు, ఆర్డీఓ కార్యాలయాలు, లేబర్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖలతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, వివిధ శాఖల జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ నిరసన కొనసాగిస్తామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు.

ఉద్యమ కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా, డివిజన్ కార్యాలయాలను ఏపీజేఏసీ నాయకులు సందర్శించి ఉద్యోగులను కలిసి ఉద్యమానికి గల కారణాలను వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని 'చేయి చేయి కలిపే' కార్యక్రమంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3, 5 తేదీల్లో అన్ని జిల్లా, డివిజన్ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో 'లంచ్ అవర్ డెమాన్‌స్ట్రేషన్స్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తొలి దశ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 11న విజయవాడతో పాటు అన్ని జిల్లాకేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశాలకు అన్ని ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించి వారి మద్దతును కూడగట్టనున్నట్లు చెప్పారు.

**ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

పీఆర్సీ, డీఏలు, మధ్యంతర భృతి, ఇతర పెండింగ్ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఏపీజేఏసీ అమరావతి నాయకులు ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు, వారికి సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో కూడా పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లుగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు ప్రయత్నం చేశామని, ప్రభుత్వంతో చర్చలకు అవకాశం కోసం ఎదురుచూశామని తెలిపారు. శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో ఉద్యమ సన్నద్ధ సభలు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందున ఆ కార్యక్రమాలను ఉపసంహరించుకున్నామని ఏపీజేఏసీ నాయకులు తెలిపారు. జూలై 22న ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ నిర్ణయాలను వెల్లడించకుండా సుమారు 40 రోజులుగా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉద్యమ కార్యాచరణను ప్రకటించామని స్పష్టం చేశారు.

**సంఘాలకు అతీతంగా ఐక్యంగా కదలాలి**

ఉద్యోగులకు రావాల్సిన న్యాయమైన బకాయిలు, హక్కుల సాధన కోసం చేపట్టిన ఉద్యమంలో ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. సంఘాలకు అతీతంగా ఉద్యోగులంతా ఐక్యంగా కదిలి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరింది. ఈ ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదని, ఉద్యోగులకు రావాల్సిన న్యాయమైన బకాయిలు, హక్కులను సాధించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యమం మరింత ఉధృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పేర్కొంది.

# విజయవాడలో ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి
- ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్







**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో సీపీఎస్ ఉద్యోగులు తరలివచ్చి తమ డిమాండ్లకు మద్దతుగా నినదించారు.

ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయకుండా ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా ఏడాదిలోపు సీపీఎస్ ఉద్యోగులతో చర్చించి సీపీఎస్ రద్దుకు బలమైన, శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చిందని, అయితే రెండేళ్లు గడిచినా ఆ హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీపీఎస్ పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందిన కొందరు ఉద్యోగులు నెలకు రూ. 500, రూ. 1,000, రూ. 2,000 వంటి అత్యల్ప మొత్తంలోనే పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. మూడు, నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు వృద్ధాప్యంలో ఇంత తక్కువ మొత్తంతో జీవనం సాగించాల్సిన పరిస్థితి దురదృష్టకరమన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరియాదాస్ మాట్లాడుతూ కరువు భత్యం (డీఏ), పీఆర్సీ అమలులో జాప్యం వంటి కారణాలతో ఉద్యోగుల ప్రాన్ ఖాతాల్లో పెన్షన్ ఫండ్ ఆశించిన స్థాయిలో పెరగడం లేదన్నారు. దీంతో పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు లభించే పెన్షన్ కార్పస్, నెలవారీ పెన్షన్ రెండూ తగిన స్థాయిలో ఉండటం లేదని పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగి మరణించిన సందర్భంలో కుటుంబ పెన్షన్ మంజూరు సమయంలో నామినీకి చెల్లించాల్సిన పెన్షన్ నిధిలోని 50 శాతం మొత్తాన్ని పూర్తిగా చెల్లించకుండా ప్రభుత్వం మినహాయించుకోవడం అన్యాయమని అన్నారు. ఉద్యోగి తన సేవా కాలంలో కష్టపడి సమకూర్చుకున్న నిధిపై కుటుంబ సభ్యులకు పూర్తి హక్కు ఉందని, ఎలాంటి కోతలు లేకుండా నామినీకి చెల్లించాల్సిన 50 శాతం మొత్తాన్ని పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ విధానం ఉద్యోగుల వృద్ధాప్యానికి, వారి కుటుంబాల భవిష్యత్తుకు తగిన ఆర్థిక భద్రత కల్పించలేకపోతోందని సంఘ నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు సీపీఎస్ లోపాలకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గౌరవించి వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్, ప్రధాన కార్యదర్శి చింతగుంట్ల మరియాదాస్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ రద్దుపై తమ ఐక్యతను చాటారు.

## ఉద్యోగుల హక్కులు అడిగితే మంత్రులు బెదిరిస్తారా?



- వైఎస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి

**తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఉద్యోగుల హక్కులు, పెండింగ్ బకాయిల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఉద్యోగ సంఘాల నాయకులను మంత్రి అనగాని సత్యప్రసాద్ బెదిరించడం దుర్మార్గమని వైఎస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 40 ఏళ్ల తన సర్వీసులో ఏ ముఖ్యమంత్రి, మంత్రి ఉద్యోగులను ఈ విధంగా బెదిరించిన దాఖలాలు లేవన్నారు. ఉద్యోగులు తమ సొమ్ము తమకు ఇవ్వాలని అడిగితే రాజకీయాలు అంటగట్టడం సరికాదని, ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు దాటినా ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీఆర్సీ, డీఏ తదితర బకాయిల రూపంలో దాదాపు రూ. 40 వేల కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. జూలై 22న మంత్రుల బృందంతో ఉద్యోగ సంఘాల సమావేశం జరిగినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడంతో పాటు 12వ పీఆర్సీని ఏర్పాటు చేసి కనీసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులు ప్రభుత్వ వ్యవస్థకు వెన్నెముకలాంటి వారని, వారిని బానిసల్లా చూస్తే సహించేది లేదని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని పేర్కొన్నారు.

ఎంప్లాయీస్ హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలు, రూ. 40 వేల కోట్ల బకాయిలను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## చేనేతలకు సకాలంలో ఆప్కో చెల్లింపులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు సకాలంలో చెల్లింపులు చేస్తోంది. ఏప్రిల్ 2024 నుంచి రెండేళ్లలో చేనేత సహకార సంఘాల నుంచి రూ. 24.51 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసి, పూర్తి స్థాయిలో చెల్లింపులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మొదటి ఏడాదిలో రూ. 18.03 కోట్ల విలువైన వస్త్రాలకు రూ. 18.02 కోట్లు, రెండో ఏడాదిలో రూ. 6.61 కోట్ల వస్త్రాలకు పూర్తిస్థాయిలో చెల్లింపులు చేశారు. దీంతో చేనేత సంఘాలపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు నేతన్నలకు నిరంతరం ఉపాధి లభించేలా చర్యలు చేపట్టారు.

మంత్రి సవిత ఆదేశాల మేరకు వివిధ శాఖలు, గురుకుల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి రూ. 1,03,38,678లను మంగళవారం 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. చేనేత సంఘాలకు ముందుగానే ఆర్డర్లు ఇవ్వడం, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాల తయారీపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉత్పత్తులకు తక్షణ చెల్లింపులు జరిగేలా మంత్రి సవిత నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు.

# వివిఐటీలో 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' చిత్ర బృందం సందడి

- విద్యార్థుల సమక్షంలో 'సబ్కో సింగిల్' పాట ఆవిష్కరణ






**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా, ఆదిత్య హాసన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' చిత్ర బృందం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (వివిఐటి)లో సందడి చేసింది. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చిత్ర బృందం మంగళవారం వివిఐటి క్యాంపస్‌ను సందర్శించింది.

ఈ సందర్భంగా హిషామ్ అబ్దుల్ వహాబ్ సంగీత సారథ్యంలో రూపొందిన 'సబ్కోసింగిల్' పాటను విద్యార్థుల హర్షధ్వానుల మధ్య ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య, వివిఐటి రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున్ రెడ్డితో పాటు కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాట ఆవిష్కరణ సందర్భంగా విద్యార్థుల ఉత్సాహం, సందడి ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ వివిఐటి క్యాంపస్‌కు రావడం, విద్యార్థుల ఉత్సాహాన్ని ప్రత్యక్షంగా చూడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాలేజీ నేపథ్యంతో, నేటి యువత భావోద్వేగాలకు అద్దం పట్టేలా 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్' చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. 'సబ్కోసింగిల్' పాటతో పాటు సినిమాలోని ప్రతి అంశం యువతను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని వీక్షించి తమ చిత్ర బృందాన్ని ఆదరించాలని కోరారు. హీరోయిన్ వైష్ణవి చైతన్య మాట్లాడుతూ వివిఐటి విద్యార్థులు చూపించిన అభిమానం, ఉత్సాహం ఎంతో అద్భుతంగా ఉన్నాయని అన్నారు. కాలేజీ జీవితానికి సంబంధించిన అనేక భావోద్వేగాలు, అనుభవాలను ప్రతిబింబించేలా ఈ చిత్రం రూపొందిందని, ముఖ్యంగా యువతకు ఈ సినిమా బాగా కనెక్ట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల మధ్య పాటను విడుదల చేయడం ప్రత్యేక అనుభూతిని కలిగించిందని తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467